


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక

సంపుటి: 4 సంచిక: 168, పేజీలు - 08

మంగళవారం, అక్టోబర్ 29, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## హైదరాబాద్‌లో మళ్లీ రజాకార్ల రాజ్యం

**- హరీష్ రావు ఫైర్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అటు నిరుద్యోగులతో పాటు ఇటు ఉద్యోగులను సైతం డీఏలు ఇవ్వకుండా మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. హైదరాబాద్ లో పండుగలు, పెండ్లిళ్ల సీజన్ లో 144 సెక్షన్ పెట్టడం ఏంటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్ లో ఐదుగురి కంటే ఎక్కువ జమ కావొద్దా..? ఇవన్నీ చూస్తుంటే నగరంలో మళ్లీ రజాకార్ల రాజ్యం వచ్చినట్లు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాలన ఎలా ఉందంటే ఎవరూ పెండ్లి చేసుకోవద్దు, బట్టలు కొనుక్కోవద్దు, పండుగలు కూడా చేసుకోవద్దు అనేలా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికీ మేలు జరగడం

2లో..

## రాజ్ పాకాలకు
# మోకిలా పోలీసుల నోటీసులు

**- హైకోర్టును ఆశ్రయించిన రాజ్ పాకాల**

- పోలీస్ నోటీసులు ఇచ్చినా పోలీసుల ఎదుట హాజరుకాని కేటీఆర్ బావమరిది
- హైకోర్టు కీలక ఆదేశాలు జారీ
- ఎవరిని అరెస్టు చేయలేదన్న ప్రభుత్వం తరపు న్యాయవాది
- రాజ్ పాకాలకు నిబంధనల మేరకే 41 నోటీసులు ఇచ్చామని వెల్లడి





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జన్వాడ ఫామ్ హౌస్ పార్టీకి సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య రగడ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు మోకిలా పోలీసులు నోటీసులను జారీ చెయ్యగా, ఆయన విచారణకు హాజరు కాకుండా కోర్టును ఆశ్రయించారు. ఇక ఆయన దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటీషన్ విచారించిన హైకోర్టు ధర్మాసనం ఆయనకు కాస్త ఊరట కలిగించే నిర్ణయం వెల్లడించింది. సోమవారం ఉదయం 11 గంటలకు తమ ముందు హాజరు కావాలని కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు మోకిలా పోలీసులు నోటీసులు జారీ చేశారు .అడ్రస్ ప్రూఫ్ లతో పాటు కేసుకు సంబంధించిన ఆధారాలు సమర్పించాలని పోలీసులు కోరారు ఇక విచారణకు రాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని కూడా పోలీసులు నోటీసులలో హెచ్చరికలు జారీ చేశారు. కానీ ఆయన పోలీసుల ఎదుట హాజరు కాలేదు. ఇక కోర్టులో రాజ్ పాకాల దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ విచారించిన హైకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసుల విచారణకు హాజరయ్యేందుకు రాజ్ పాకాలకు రెండు రోజుల సమయం ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిబంధనల ప్రకారమే ఈ కేసులో దర్యాప్తుకు ముందుకు వెళ్లాలని కోర్టు పోలీసులకు సూచించింది. విచారణ జరపగా పిటిషనర్ తరపు న్యాయవాది మయూర్ రెడ్డి తన వాదనలు వినిపించారు. రాజ్ పాకాల ఇంట్లో పార్టీ చేసుకుంటే అక్రమంగా పోలీసులు వచ్చి దాడి చేశారని, రాజ్ పాకాల ఉద్యోగికి డ్రగ్ పాజిటివ్ వస్తే, రాజ్ పాకాల ను నిందితుడిగా చేర్చారని పేర్కొన్నారు. డ్రగ్స్ టెస్టుకు శాంపిల్స్ ఇవ్వాలని మహిళలను కూడా ఇబ్బంది పెట్టారని, వారు కోర్టు ధర్మాసనం ముందు వాదించారు. ప్రతిపక్ష నేత కేటీఆర్ బావమరిది కాబట్టే ఆయనను టార్గెట్ చేశారని,

2లో..

## ప్రైవేట్ రంగంలో తొలిసారి
## సైనిక విమానాల తయారీ ఫ్యాక్టరీ

**- స్పెయిన్ ప్రధానితో కలిసి ప్రారంభించిన మోదీ**



**గాంధీనగర్ (ప్రశ్న న్యూస్)** దేశంలోనే ప్రయివేట్ రంగంలో మొట్టమొదటి యుద్ధ విమానాల తయారీ కర్మాగారం అందుబాటులోకి వచ్చింది. గుజరాత్‌లోని వడోదరలోని టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్‌లోని నెలకొల్పిన సి-295 సైనిక రవాణా విమానాల ఉత్పత్తి ఫ్యాక్టరీని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సోమవారం ప్రారంభించారు. వచ్చే ఏడాది సెప్టెంబరు నుంచి ఉత్పత్తి మొదలవుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు చెందిన ఈ కర్మాగారానికి 2022 అక్టోబరులో మోదీ శంకుస్థాపన చేశారు. భారత్‌కు మొత్తం 56 సి-295 యుద్ధ విమానాల సరఫరాకు 2021 సెప్టెంబరులో రూ.21,935 కోట్ల మేర స్పెయిన్‌తో ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా 16 విమానాలు స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ సంస్థ అందజేయనుండగా మిగతావి వడోదర యూనిట్‌లో తయారవుతాయి. సుదీర్ఘకాలంగా వైమానిక దళంలో సేవలు అందిస్తోన్న ఆవ్రో-748 విమానాల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. కాగా, సి-295కు సంబంధించిన విడి భాగాల ఉత్పత్తి హైదరాబాద్‌లోని 'మెయిన్ కన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీ'లో ఇప్పటికే ప్రారంభమైంది. వీటిని వడోదర యూనిట్‌కు తరలించి, అక్కడే తుది కూర్పు జరుగుతుంది. 'విడి భాగాల కూర్పు, పరీక్షలు, నిర్వహణ వరకు అన్ని పూర్తి స్థాయిలో ఇక్కడే జరుగుతాయి' అని అధికారులు తెలిపారు.

2లో..

## అక్టోబర్ 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం

**- ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు**

- సిలిండర్ సబ్సిడీ నిధుల విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- రూ.895 కోట్లు విడుదలకు ఉత్తర్వులు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీ ప్రజలకు ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి సంబంధించి మరో కీలక ముందడుగు పడింది. ఈ పథకం రాయితీ నిధులు విడుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ కంపెనీలు, పౌర సరఫరాలశాఖ తెరిచిన ఖాతాలో ఈ నిధులు జమ చేయనున్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో భాగంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఓ సిలిండర్ రాయితీ మొత్తం రూ.895 కోట్లు విడుదల చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

**- దీపావళి నుంచి ప్రారంభం**

ఈ నెల 31 నుంచి దీపావళి

2లో..

# అమెరికా పర్యటనలో నారా లోకేష్

**- టెస్లా ప్రతినిధులతో సమావేశం - అనంతపురంలో పెట్టుబడులకు ఆహ్వానం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఆయన పెరోట్, టెస్లా సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ముందుగా లోకేష్ పెరోట్ గ్రూప్ అండ్ హిల్‌వుడ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏవియేషన్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఏపీ తీరప్రాంతం అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు అనుకూలమని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో పోర్టులు, హైవేలు, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరగా పెరోట్ గ్రూప్ ఛైర్మన్ రాస్ పెరోట్ సానుకూలంగా స్పందించారు.మరోవైపు నారా లోకేష్ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న టెస్లా (ఆస్టిన్) కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. టెస్లా సంస్థ సీఎఫ్‌వో వైభవ్ తనేజాతో సమావేశమై ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల

2లో..

## పోస్టులు పెట్టినా, లైకులు కొట్టినా ఇంటికే

**- పోలీస్ సిబ్బందికి సెక్రటేరియట్ సెక్యూరిటీ చీఫ్ వార్నింగ్**

- పోలీసుల ప్రతి కదలికపై నిఘా
- సచివాలయ పోలీస్ సిబ్బందికి హెచ్చరికలు
- మెమో జారీ చేసిన సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సచివాలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి సెక్రటేరియట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేఖంగా సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టినా వేరే వ్యక్తులు పెట్టిన పోస్టులకు లైకులు, కామెంట్లు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ మెమో జారీ చేశారు. పోలీస్ సిబ్బంది ప్రతి కదలికపై నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు. ఏమాత్రం తప్పు చేసినట్టు తెలిసినా ఇంటికి

2లో..

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీలు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, నల్గొండ కలెక్టర్‌గా త్రిపాఠిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మందా మకరందు, పర్యాటక శాఖ సంచాలకులుగా జెడ్ కె.హనుమంతులును నియమించగా దేవాదాయ శాఖ సంచాలకులుగా హనుమంతులుకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే మరో డేరింగ్ లేడీ ఆఫీసర్ అయిన టీకే శ్రీదేవికి పురపాలక శాఖ సంచాలకులుగా కీలక బాధ్యతలు అప్పజెప్పింది రేవంత్ రెడ్డి సర్కార్. గతంలో బీఆర్ఎస్ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన టీకే శ్రీదేవి 2023లో కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేయటంపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూ చర్చనీయాంశంగా మారారు. కాగా ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ కీలక శాఖ అయిన పురపాలన శాఖ బాధ్యతలు అప్పగించటం గమనార్హం. మరోవైపు విపత్తు నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి హరీశ్‌కు ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. ఇక డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కె.చంద్రశేఖర్ రెడ్డి,

2లో..

## సామాన్యులకు
## ఎలాంటి విద్యుత్ భారం ఉండదు

**- ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రజలకు భారీ ఊరట లభించింది. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయని గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు చేసిన ప్రకటనతో రాష్ట్రంలో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు కోసం డిస్కంల ప్రతిపాదనలను సోమవారం (అక్టోబర్ 28న) రోజున ఈఆర్సీ తిరస్కరించటంతో విద్యుత్ వినియోగదారులకు భారీ ఊరట లభించినట్టయింది. 800 యూనిట్లు దాటితే ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ. 10 నుంచి రూ. 50 పెంచాలనే డిస్కమ్‌ల ప్రతిపాదనలను కమిషన్ ఎంతమాత్రం ఆమోదించలేదు. డిస్కంల 8 పిటిషన్లపై కమిషన్ తన అభిప్రాయాలను వెల్లడించిందని ఈఆర్సీ ఛైర్మన్ శ్రీరంగారావు తెలిపారు. అన్ని పిటిషన్లపై ఎలాంటి లాప్స్ లేకుండా వెల్లడించాలని ఈఆర్సీ నిర్ణయించిందని శ్రీరంగారావు తెలిపారు. 40 రోజుల తక్కువ సమయంలో నిర్ణయం వెలువరిస్తున్నామని చెప్పుకొచ్చారు. విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, వినియోగదారులు, ప్రభుత్వ సబ్సిడీ దృష్టిలో పెట్టుకొని కమిషన్

2లో..

## కేరళ సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం

**- ఢీకొన్న 5 కార్లు**



**తిరువనంతపురం (ప్రశ్న న్యూస్)** కేరళ సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో ఉన్న పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. స్కూటీపై వెళ్తున్న ఓ మహిళ నడిరోడ్డుపై మలుపు తీసుకుంటుండగా వెనక నుంచి వేగంగా వచ్చిన సీఎం కాన్వాయ్‌లోని వాహనాలు ఒక్కసారిగా సడెన్ బ్రేకులు వేశారు. దీంతో వాటి వెనక వచ్చిన వాహనాలు కంట్రోల్ కాకపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో అవి కాస్తా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ప్రమాదంలో

2లో..

## వచ్చే నెలలో
## తెలంగాణ వ్యాప్తంగా కులగణన

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో వచ్చే నెల నుంచి కుల గణన చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో చేపట్టనున్న కుల గణన దేశవ్యాప్తంగా ఒక మోడల్ గా నిలుస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో సోమవారం నాడు భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. కుల గణనలో సుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో చర్చలు జరిపారు.

2లో..

## హైదరాబాద్‌లో మళ్లీ రజాకార్ల రాజ్యం

లేదని, కనీసం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను సైతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగించడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. దసరాకు బతుకమ్మ చీరలు ఇవ్వలేదని, రైతులకు రూ.15 వేలు ఇవ్వకుండా మొండిచేయి చూపింది. రాష్ట్రంలో వడ్లు కొనే దిక్కులేదు, మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. రూ.2,320 మద్దతు ధర రావాల్సిన వడ్లను రూ. 1900 కే రైతులు అమ్ముకుంటున్నారని హరీష్ రావు తెలిపారు. రూ.7500 మేర మద్దతు ధర రాకోవడంతో రూ.5500 కే విక్రయించి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. కొత్త హామీలు అమలు చేయలేని రేవంత్ కేసీఆర్ మానవీయ కోణంలో పేదలు, ప్రజల కోసం తెచ్చిన పథకాను కొనసాగించలేకపోతున్నారని ఆరోపించారు. బతుకమ్మ చీరలు ఒకటి కాదు రెండు ఇస్తామని చెప్పి ఒకట కూడా ఇవ్వలేదన్నారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇస్తా అని రేవంత్ రెడ్డి చెప్పారి, ఇప్పుడు ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదని విమర్శించారు. పదిహేను వేలు కాదు, ఉన్న పది వేలు కూడా రావడం లేదని ధ్వజమెత్తారు. రైతులు రోడ్డెక్కితే నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని ఎద్దేవా చేసారు.

## రాజ్ పాకాలకు మోకిలా పోలీసుల నోటీసులు

రాజకీయ దురుద్దేశంతోనే ఆయన పైన కేసులు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనను వినిపించి ఇప్పటివరకు కేసులో ఎవరిని అరెస్టు చేయలేదని అక్రమంగా మద్యం బాటిల్స్ లభించడంతో పాటు ఒక వ్యక్తికి డ్రగ్స్ తీసుకున్నట్టు పాజిటివ్ రావడంతో విచారణ జరుపుతున్నామని తెలిపారు.మేము ఎవరిని అరెస్టు చేస్తామని ఎక్కడా చెప్పలేదని పేర్కొన్నారు. ఇందులో రాజకీయ దురుద్దేశం లేదని రాజ్ పాకాలకు నిబంధనల మేరకే 41 నోటీసులు ఇచ్చామని కోర్టుకు ఏఏజీ ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ఇక విచారణలో సమాచారం లేదా ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం తరపున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు.

## ప్రైవేట్ రంగంలో తొలిసారి సైనిక విమానాల తయారీ ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఇది చాలా ప్రత్యేకమైన రోజు అని ఆయన అన్నారు. 'సి-295 ప్రాజెక్టు భారతీయ ప్రయివేట్ రంగానికి అతిపెద్ద విజయం.. ఒక ప్రైవేట్ కంపెనీ ద్వారా భారత్ పూర్తి సైనిక విమానాన్ని తయారు చేసే మొదటి ప్రాజెక్ట్ ఇది. ఈ ప్రాజెక్ట్ భారత్‌లో పెరుగుతున్న ఏరోస్పేస్ పర్యావరణ వ్యవస్థకు పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తుంది' అని ట్వీట్ చేశారు. ఇక, సి-295 సైనిక రవాణా విమానాలు 5 నుంచి 10 టన్నుల సామర్థ్యంతో ఉంటాయి. లాజిస్టిక్ ఆపరేషన్ల కోసం 50 నుంచి 70 మంది సైనికులను దీని ద్వారా తరలించవచ్చు. ప్రస్తుతం వైమానిక దళం వద్ద ఉన్న భారీ విమానాలు వెళ్లలేని ప్రదేశాలకు వీటి ద్వారా సైన్యాలను పంపుతారు. అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ నడిపగలిగే ఈ విమానం 11 గంటల పాటు నిరాటకంగా ప్రయాణిస్తుంది.

## అక్టోబర్ 31 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం

సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు 2 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ నగదు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్పీజీ కనెక్షన్ కలిగి అర్హత గల ప్రతీ కుటుంబానికి ఈ పథకం వర్తింపచేయాలని స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ రిటైల్ మార్కెట్ ధర రూ.876 కాగా.. కేంద్రం ప్రతి సిలిండర్‌కు రూ.25 సబ్సిడీ ఇస్తుండగా ప్రస్తుతం ప్రతీ సిలిండర్ ధర రూ.851గా ఉంది. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ వల్ల ప్రభుత్వంపై రూ.2,684 కోట్ల భారం పడనుంది. ఐదేళ్లకు రూ.13,423 కోట్ల భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ పారదర్శక విధానంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదారులు ప్రతి 4 నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తామని చెప్పింది. ఈ పథకం ద్వారా పేదల జీవన ప్రమాణం పెరుగుతుందని సర్కారు భావిస్తోంది.

**- ఈ కేవైసీ తప్పనిసరి**

మరోవైపు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డులను ప్రాతిపదికగా తీసుకొని వంట గ్యాస్ సిలిండర్ రాయితీ ఇస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం వంట గ్యాస్ ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్నప్పటికీ.. ఆధార్, ఫోన్ నెంబర్ ఆధారంగా బుకింగ్ అవుతోంది. రాయితీ పొందాలంటే రేషన్ కార్డుల వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. ఈ వివరాలు ఎలా పొందుపరచాలనే దానిపై స్పష్టత కొరవడినట్లు తెలుస్తోంది. దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులకు పూర్తి సమాచారం రాలేదు. అటు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ప్రభుత్వం ఈ కేవైసీ తప్పనిసరి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 1.47 కోట్ల మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా.. అందులో ఇప్పటివరకూ 20 లక్షలకు పైగా గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈ కేవైసీ చేసుకోలేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఈ కేవైసీ కాకుంటే గ్యాస్ కంపెనీల వద్ద ఉండే డేటా, ప్రభుత్వం వద్ద ఉండే డేటా సరిపోయే అవకాశాలు లేవు. దీంతో పెద్ద సంఖ్యలో వినియోగదారులు ఈ కేవైసీ నమోదు కోసం గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్తున్నారు.

**- పథకం అమలు ఇలా**

- ఈ నెల 29వ తేదీ నుంచి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభం. బుక్ చేసుకోగానే లబ్ధిదారుని ఫోన్ నెంబరుకు సందేశం వెళ్తుంది.
- పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో సిలిండర్లు డెలివరీ చేస్తారు. డెలివరీ అయిన 48 గంటల్లో డీబీటీ ద్వారా లబ్ధిదారుని ఖాతాలో రాయితీ సొమ్ము జమ అవుతుంది.
- ఈ పథకం అమలుకై 3 బ్లాక్ పీరియడ్లుగా పరిగణిస్తారు. మొదటి బ్లాక్ పీరియడ్ ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు, రెండో బ్లాక్ పీరియడ్ ఆగస్ట్ 1 నుంచి నవంబర్ 31 వరకూ, మూడో బ్లాక్ పీరియడ్ డిసెంబర్ 1 నుంచి మార్చి 31 వరకూ పరిగణిస్తారు.
- మొదటి సిలిండర్ మార్చి 31లోపు, రెండోది జులై 31లోపు, మూడోది నవంబర్ 30లోపు ఎప్పుడైనా పొందొచ్చు. పథకం అమల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెంబర్.. 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యొచ్చు.

## అమెరికా పర్యటనలో నారా లోకేష్

తయారీ యూనిట్ల ఏర్పాటుకు అనంతపురం జిల్లా అనుకూలమని వివరించారు. 2029 నాటికి ఏపీలో 72 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని టెస్లా నుంచి దీనికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. రాష్ట్రంలో సోలార్ పవర్, స్మార్ట్‌సిటీలు, గ్రామీణ విద్యుదీకరణకు సోలార్ ప్లేట్స్ అమర్చడంలో భాగస్వామ్యం కావాలని లోకేష్ కోరారు. ఈవీ ఛార్జింగ్ నెట్‌వర్క్ అభివృద్ధి, సూపర్ ఛార్జింగ్ టెక్నాలజీ అమల్లోనూ భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్రంలో టెక్నాలజీ పార్కులు ఏర్పాటు చేయాలని టెస్లా సీఎఫ్‌వోని రిక్వెస్ట్ చేశారు లోకేష్. టెస్లా ఎలక్ట్రిక్ వాహనాలు, క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాటరీ స్టోరేజీలో టెస్లా గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు వైభవ్ తనేజా.

అంతకముందు మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ శ్రీకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలత సమావేశానికి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేస్తోందన్నారు మంత్రి. రాష్ట్రంలో యువతకు రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యానికి తగిన విధంగా ఆరు పాలసీలను తీసుకొచ్చామని చెప్పారు. ఎన్ఆర్ఐల నుంచి కూడా భారీగా పెట్టుబడుల కోసం ఎదురు చూస్తున్నామని.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 25శాతం మొబైల్స్, 50శాతం ఏసీలు ఆంధ్రప్రదేశ్‌లోనే తయారవుతున్నాయన్నారు.కర్నూలు డ్రోన్ వ్యాలీగా, చిత్తూరు, కడప జిల్లాలను ఎలక్ట్రానిక్స్ హబ్‌లుగా తయారు చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు మంత్రి. కృష్ణా, గుంటూరు కేపిటల్ రీజియన్‌లో భారీగా అభివృద్ధి పనులు గోదావరి జిల్లాల్లో ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, పెట్రో కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో కెమికల్, ఫార్మా రంగాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టిందన్నారు. అలాగే మరికొందరు పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలను మంత్రి లోకేష్ కలిశారు. రాష్ట్రంలో పెట్టుడులకు ముందుకు రావాలని కోరారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ప్రపంచ ప్రఖ్యాత డేటా సేవల సంస్థ ఈక్వెనెక్స్ డేటా సెంటర్ కేంద్ర కార్యాలయాన్ని లోకేష్ సందర్శించారు.

## పోస్టులు పెట్టినా, లైకులు కొట్టినా ఇంటికే

పంపించనున్నట్టు హెచ్చరించారు. ఈ మేరకు జారీ చేసిన మెమో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసు కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో సచివాలయ పోలీస్ సిబ్బందికి ఈ హెచ్చరికలు జారీ చేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**- మెమోలోని సారాంశం ఉన్నది ఉన్నట్టుగా..**

"1) రాష్ట్రానికి అతిముఖ్యమైన సచివాలయం నందు మనం విధులు నిర్వర్తిస్తున్నాం. కనుక మన మీద చాల మందికి నిఘా ఉంటుంది. ఇక్కడ విధులు నిర్వర్తించే వారు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏ పోస్టులు పెడుతున్నారు. ఇలా ఇంకా చాలా విషయాల మీద. కావున ఇక్కడ సిబ్బంది ఒక్కరు కూడా అనవసరమయిన విషయాల్లో జోక్యం చేసుకోకండి. ఏ ఒక్కరు తప్పు చేసిన అందరి మీద ప్రభావం పడుతుంది.

2) ఈ రోజు నుంచి సచివాలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలులో ఉంది. కావున ఐదుగురి కంటే ఎక్కువగా గుమిగూడి ఉన్నా, ధర్నాలు, రాస్తారోకోలు, సచివాలయ ముట్టడి లాంటి వాటిలో పాల్గొంటే వారి మీద చట్టపరమయిన చర్యలు తీసుకోబడతాయి. కావున మీ కుటుంబ సభ్యులకు, బంధువులకు, మిత్రులకు, తోటి సిబ్బందికి తెలియపర్చండి.

3) మీరు చాల వాట్సాప్ గ్రూప్‌లలో అడ్మిన్‌గా ఉంటూ, మిగతా సిబ్బందిని గ్రూప్‌లో యాడ్ చేస్తూ టీజీఎస్పీ వ్యవస్థ గురించి, పోలీస్ ఆఫీసర్స్ గురించి రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారు. కానీ మీ ప్రతి కదలికల మీద నిఘా పెట్టారు. కావున అందరు కూడా తక్షణమే అటువంటి గ్రూప్స్ నుంచి ఎగ్జిట్ అవ్వండి.

4) మీరు, మీ కుటుంబ సభ్యులు కూడా ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు మొదలైన అనుమతి లేని కార్యక్రమాల్లో పాలొనవద్దు. అలా చేయడం వల్ల చాల ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.

5) మీరు ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ అనగా టెలిగ్రామ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, వాట్సప్‌లో టీజీఎస్పీ వ్యవస్థ గురించి, పోలీస్ ఆఫీసర్స్ గురించి, గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం, షేర్ చేయడం, కామెంట్ చేయడం, లైక్ చేయడం లాంటివి చేయవద్దు. మీ ప్రతి కదలికల మీద నిఘా పెట్టారు. పొరపాటున మీరు దొరికితే తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోబడును.

చివరగా చెప్పేది ఏమనగా పైన పేర్కొన్న విషయాలు దృష్టిలో ఉంచుకుని సచివాలయలో విధులు నిర్వర్తించే టీజీఎస్పీ ఆఫీసర్స్, సిబ్బంది దయచేసి ఎవరు కూడా పైన తెలియజేసిన విషయాల్లో కలుగచేసుకోకండి. ఏమైనా తప్పు జరిగితే తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోబడును. సచివాలయంలో ఏ చిన్న తపిదం జరిగినా, చేసినా దాని యొక్క ప్రభావం టీజీఎస్పీ వ్యవస్థ మీద పడుతూ.. అందరం కూడా ఇక్కడ నుండి వెళ్లాల్సి ఉంటుంది." అంటూ సచివాలయ సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్ మెమోలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఓ కాపీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.దిలీప్ కుమార్, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఏకంగా 47 మంది డిప్యూటీ, 23 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను రేవంత్ రెడ్డి సర్కార్ బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, 4 జిల్లాల డీఆర్వోలు స్థానచలనం అయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## కేరళ సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం

ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 5.44 గంటల సమయంలో కేరళ రాజధాని తిరువనంతపురంలోని వామనపురం పార్క్ జంక్షన్ వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎంసీ రోడ్ నుంచి అట్టింగల్ వెళ్తున్న ఓ మహిళ నడిరోడ్డుపై స్కూటీ ఇండికేటర్ వేసి వేచి ఉంది. ఎదురుగా వాహనాలు వస్తుండటంతో అవి వెళ్లేవరకు ఆమె అక్కడే రోడ్డుపై ఆగింది. అయితే వెనకనుంచి వేగంగా వచ్చిన ముఖ్యమంత్రి పినరయి విజయన్ కాన్వాయ్‌లోని వాహనాలు ఆ మహిళ స్కూటీ వద్దకు రాగానే సడెన్ బ్రేక్ వేశాయి. దీంతో వరుసగా వస్తున్న కాన్వాయ్‌లోని 5 వాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొట్టుకున్నాయి. అందులో ఓ అంబులెన్స్ కూడా ఉండటం గమనార్హం. ఇక ఈ సీఎం కాన్వాయ్ యాక్సిడెంట్ దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డ్ అయ్యాయి. ఇక ఈ ప్రమాద సమయంలో సీఎం పినరయి విజయన్ కాన్వాయ్‌లోనే ఉన్నా ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆ ఘటన జరిగిన వెంటనే సీఎం కాన్వాయ్‌లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది బయటికి వచ్చి పరిస్థితిని అంచనా వేశారు. అనంతరం కాన్వాయ్‌ను రోడ్డుపై నుంచి పక్కకు తీసుకెళ్లి ఎవరికీ ఏం గాయాలు కాలేదని ధృవీకరించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి సీఎం కాన్వాయ్ వెళ్లిపోయింది. అయితే కాన్వాయ్ రోడ్డుపై ఉన్న లైన్‌ను దాటి మరీ కుడి వైపునకు రావడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సీసీటీవీ వీడియో చూస్తే స్పష్టంగా అర్థం అవుతోంది.

## వచ్చే నెలలో తెలంగాణ వ్యాప్తంగా కులగణన

**- నేడు కలెక్టర్లతో కాన్ఫరెన్స్**

తెలంగాణలో వచ్చే నెల నవంబర్ 6 నుంచి చేపట్టనున్న కులగణనకు సంబంధించి దిశా నిర్దేశం చేయడానికి నేడు (అక్టోబర్ 29) కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి అభిప్రాయాన్ని ఇంకా ఎలాంటి ప్రశ్నలు వేస్తే బాగుంటుందని అధికారులు సలహా అడిగారు. 300 మంది సామాజికవేత్తలు, మేధావులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వీరితో పాటు కుల సంఘాలు, యువజన సంఘాలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. వీరితో పాటు బీసీ కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. ప్రణాళిక శాఖ రూపొందించిన ప్రశ్న పత్రం సమగ్రంగా ఉందని సామాజికవేత్త యోగేంద్ర యాదవ్ లాంటి మేధావులు అభినందించారని భట్టి విక్రమార్క తెలిపారు.

**- కామారెడ్డి డిక్లరేషన్, ఎన్నికల హామీ ప్రకారం కుల గణన**

మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో కుల గణన చేస్తామని కామారెడ్డి లో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ బహిరంగ సభలో ప్రకటించామన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని పొందుపరిచినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం అసెంబ్లీలో తీర్మానం చేసి ఇచ్చిన హామీకి కార్యరూపం తీసుకువచ్చామని తెలిపారు. పాత కమిషన్ కాలం ముగిసిన వారంలోపే కొత్త బీసీ కమిషన్ వేశాం, బీసీ సంక్షేమం అభ్యున్నతి పట్ల తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. ఇప్పటికే 4 జిల్లాల్లో 56 ఇండ్లు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కులగణన సర్వే పూర్తి చేశామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రొఫెసర్ మురళి మనోహర్ న్యాయ పరమైన చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రోజుకు ఒక ఎన్యుమరేటర్ 15 ఇండ్లు సర్వే చేయడం భారం అనుకుంటే ఆ సంఖ్యను 10కి కుదించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మంత్రులకు సూచించారు. కులగణనకు సంబంధించి జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ సింహాద్రి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులకు ఎలాంటి విద్యుత్ భారం ఉండదు

నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. విద్యుత్ ఛార్జీలు ఏ కేటగిరిగిలో కూడా పెంచడం లేదని శ్రీరంగారావు స్పష్టం చేశారు. ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ.10 యథాతథంగా ఉంటాయని క్లారిటీ ఇచ్చారు. పౌల్ట్రీ ఫాం, గోట్ ఫాంలను కూడా కమిషన్ ఆమోదించలేదన్నారు. హెచ్‌టీ కేటగిరిలో ప్రతిపాదనలు రిజక్ట్ చేశామని శ్రీరంగారావు చెప్పుకొచ్చారు.

132 కేవీఏ, 133 కేవీఏ, 11కేవీలలో గతంలో మాదిరిగానే ఛార్జీలు ఉంటాయని శ్రీరంగారావు తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు కమిషన్ ఆమోదించిందన్నారు. టైమ్ ఆఫ్ డేలో పీక్ అవర్‌లో ఎలాంటి మార్పు లేదని కూడా స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలకు నాన్ పీక్ అవర్‌లో రూపాయి నుంచి రూపాయిన్నర రాయితీ పెంచినట్టు చెప్పుకొచ్చారు. చేనేత కార్మికులకు హార్స్ పవర్‌ను 10 నుంచి 25 హెచ్పీకి పెంచినట్టు శ్రీరంగారావు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు మినిమమ్ ఛార్జీలు కూడా తొలగించినట్టు శ్రీరంగారావు తెలిపారు. గ్రిడ్ సపోర్ట్ ఛార్జీలను కూడా కమిషన్ ఆమోదించిందన్నారు. ఆర్ఎస్పీ కేవలం 5 నెలల వరకే ఉంటాయని వివరించారు. రూ.11,499.52 కోట్లు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చిందని రూ.1,800 కోట్లు ప్రపోజల్స్ ఇచ్చారని చెప్పుకొచ్చారు. డిస్కంలు రూ.57,728.90 పిటిషన్ వేస్తే ఈఆర్సీ రూ.54,183.28 కోట్లు ఆమోదించిందిని శ్రీరంగారావు పేర్కొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుంది - వేం నరేందర్ రెడ్డి

**- కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యం**



**ఉప్పల్ (ప్రశ్న న్యూస్)** కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కనకయ్య ముదిరాజ్ ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి ని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు పార్టీ లో సరైన గుర్తింపు ఉంటుందని, పార్టీ గురించి కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఈ సందర్భంగా అన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు తగిన న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో వచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ, అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందని, బిఆర్ఎస్ పార్టీ పది సంవత్సరాలు పరిపాలించిన తెలంగాణ రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆస్తులను పెంచుకున్నారే తప్ప, తెలంగాణ ప్రజలకు చేసింది ఏమీ లేదని, కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

## బీసీ ఉద్యోగుల పదోన్నతుల రిజర్వేషన్లపై ఉద్యమం ఉద్ధృతం

**హైదరాబాద్** బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని పలు కమిషన్‌లు సిఫార్సు చేసినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. అఖిల భారత బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ ఉద్యోగుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వాలు వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బీసీ ఉద్యోగుల పదోన్నతుల రిజర్వేషన్లపై అన్ని పార్టీలతో చర్చిస్తున్నామని, ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, బీసీ ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు, మరియు బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నేతలు, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

## పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

**రాజన్న సిరిసిల్ల** జిల్లా కేంద్రంలో ఉత్సాహభరితంగా కొనసాగిన 2కె రన్ ఉత్సాహకంగా పాల్గొన్న పోలీస్ అధికారులు,సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు,వాకర్స్. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణం బతుకమ్మ ఘాట్ నుండి గాంధీ,అంబేద్కర్ చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం వివిధ కార్యక్రమాలు చెపడుతున్నామని,అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని, ప్రజా రక్షణలో, శాంతి భద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని చెప్పారు.ప్రతీ ఒక్కరి ఆరోగ్య రక్షణకు వ్యాయామం చేయడం ముఖ్యమని, మానసికంగా,శారీరకంగా దృఢంగా ఉండడానికి వాకింగ్,వ్యాయామం,యోగ ప్రతి నిత్యం చేయాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు.యువత చెడు మార్గాల వైపు మరలకుండా చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు.అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన 2కె రన్ లో ప్రజలు, విద్యార్థులు భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. 2కె రన్ లో అందరితో పాటుగా పాల్గొని పూర్తి చేసిన ఇద్దరు మహిళలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి వారికి అందరూ ఆదర్శంగా తీసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో అధనవు ఎస్పీ చంద్రయ్య, సిఐ లు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఆర్ఐ లు యాదగిరి, రమేష్, ఎస్సై లు,పోలీస్ సిబ్బంది, మెడికల్ కాలేజ్ విద్యార్థులు, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థులు, పట్టణ యువత వాకర్స్ పాల్గొన్నారు.

## మోమోస్‌తిని ఒకరు మృతి

**- పలువురికి అనారోగ్యం**

మోమోస్ తిని ఒకరు మృతి చెందాడమే కాకుండా దాదాపు 50 మంది ఆసుపత్రి పాలైన సంఘటన బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నంది నగర్, సింగాడి బస్తి, గౌరీ శంకర్ కాలని లో శుక్రవారం జరిగిన సంతల్లో మొమోస్ విక్రయించారు. సింగాడ కుంట బస్తికి చెందిన రేష్మ బేగం(31) తో పాటు ఆమె పిల్లలు మోమొస్ తిన్నారు. వీరితో పాటు ఆయా బస్తీల్లో ని దాదాపు 50 మందికి పైగా వీటిని తిన్నారు. వీరందరికీ శనివారం నుంచి వాంతులు, విరేచనాలు ప్రారంభం అయ్యాయి. ఈ క్రమంలోనే వీరంతా బంజారా హిల్స్ చుట్టూ పక్కల ప్రాంతాల్లో ఉన్న పలు ఆసుపత్రులలో చేరారు. వీరిలో కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. దాదాపు పది మందికి పైగా మైనర్లు ఉన్నారు. సింగారకుంట బస్తికి చెందిన రేష్మ బేగం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. పవన్ కుమార్ తల్లి ఇద్దరు ఆస్పత్రిలో ఉన్నారు. ఈ సంఘటనపై ఇప్పటికే బాధితులు బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు దీంతో మోమోస్ విక్రయించిన ఇద్దరినీ బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలువురి బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ను ఆశ్రయిస్తున్నారు. మోమోస్ తో పాటు వాటిలోకి ఇచ్చే మయోనీజ్, మిర్చి చట్నీల కారణంగా ఈ సమస్య ఏర్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

## బెటాలియన్ పోలీసులు అరెస్టు

**హైదరాబాద్** ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ బెటాలియన్ పోలీసుల ఆందోళన సోమవారం కుడా కొనసాగింది. ఇందిరా పార్క్ ధర్నా చౌక్ బయలు దేరిన బెటాలియన్ పోలీసులను ఎన్టీఆర్ స్టేడియం వద్దే అరెస్ట్ చేసారు. అరెస్టు చేసిన బెటాలియన్ పోలీసులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

## గురుకుల విద్యార్థినిలకు అస్వస్థత

**మంథని** మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో 25 మంది గురుకుల విద్యార్థినులుకు అస్వస్థతకు గురయ్యారు. మంథని - ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఘటన జరిగింది. విద్యార్థినులకు తీవ్రంగా దగ్గు రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫుడ్ ఇన్ఫెక్షన్ అయినట్టు అనుమానిస్తున్నారు.

# ఇంటికే ఆర్టీసీ కార్గో సర్వీసులు

**నల్గొండ : :** మీరు హైదరాబాద్ లో ఉన్నారా.. అయితే టీజీఎస్ఆర్టీసీ కొత్త తరహా సేవలు మీ ముందుకు తెస్తోంది. ఇప్పటి వరకు ఆర్టీసీ కార్గో పార్సిల్ సర్వీస్ అందజేస్తున్న టీజీఎస్ఆర్టీసీ, పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా మీ ఇంటికే పార్శిల్ సర్వీస్ ను డెలివరీ చేయనుంది. ఈ సేవలు కూడా రేపటి నుండే ప్రారంభం కానున్నాయి. మీ ఇంటి నుండి కాలు బయటకు పెట్టకుండా, తెలంగాణ ఆర్టీసీ సంస్థ కార్గో సర్వీస్ పరంగా నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ టీజీఎస్ఆర్టీసీ విశేష ఆదరణ పొందుతోంది. ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా, టీజీఎస్ఆర్టీసీ బస్సులను పెంచి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంది. అలాగే ఆర్టీసీ సంస్థ కార్గో సేవలను అందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఏదైనా పార్శిల్ చేస్తే, సంబంధిత వ్యక్తి కార్గో సర్వీస్ వద్దకు వెళ్లి పార్శిల్ పొందాలి. కానీ ఇప్పుడు ఆ పద్ధతికి స్వస్తి పలికేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జస్ట్ పూర్తి అడ్రస్ రాస్తే చాలు.. హైదరాబాద్ వాసుల ఇంటికే పార్శిల్స్ డెలివరీ కానున్నాయి. ఈ సర్వీస్ ను అమలు చేసేందుకు హైదరాబాద్ నగరాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా టీజీఎస్ఆర్టీసీ గుర్తించింది.టీజీఎస్ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు గాను లాజిస్టిక్స్ కార్గో సేవలను మరింతగా విస్తరిస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ లో వేగవంతమైన సేవలను అందించేందుకు హోం డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్ లోని 31 ప్రాంతాల నుండి హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని, టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్స్ నుంచి హైదరాబాద్ లో ఎక్కడికైనా హోం డెలివరీ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో ఇంటి నుంచి ఇంటి వరకు సేవలు అందించేలా లాజిస్టిక్స్ విభాగాన్ని టీజీఎస్ఆర్టీసీ అభివృద్ధి చేస్తోందని, ప్రజలందరూ హోం డెలివరీ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని, వినియోగదారులను మంత్రి కోరారు.టీజీఎస్ఆర్టీసీ ప్రవేశపెట్టనున్న కార్గో హోమ్ డెలివరీ సేవలకు సంబంధించి చెల్లించాల్సిన ధరలను కూడా మంత్రి పొన్నం ప్రకటించారు. 0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50, 1.01నుంచి 5 కేజీలకు రూ.60, 5.01 నుంచి 10 కేజీలకు రూ.65, 10.1 నుంచి 20 కేజీలకు రూ.70, 20.1 నుంచి 30 కేజీలకు రూ.75, 30.1 కేజీలు దాటితే.. స్లాబ్ ల ఆధారంగా ధరలు ఉంటాయన్నారు. హైదరాబాద్ ను పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసుకొని, ప్రారంభిస్తున్న టీజీఎస్ఆర్టీసీ హోమ్ డెలివరీ సర్వీసులను ఆదరించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. మరెందుకు ఆలస్యం.. గడప దాటకుండా మీ చెంతకు పార్శిల్ వచ్చే అవకాశాన్ని మిస్ చేసుకోకండి సుమా!

# బావను బుక్ చేసిన బావమరిది

**హైదరాబాద్ :** మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన పార్టీకి సంబంధించి భారత రాష్ట్ర సమితి నాయకులు ఇస్తున్న వివరణ, చేస్తున్న ప్రతి విమర్శ ఇది. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఈ పార్టీ నిర్వహించారని.. పోలీసులు రాగానే వెనుక గోడ నుంచి దూకి పారిపోయాడని.. ఇందులో విజయ్ అనే వ్యక్తి శరీరం నుంచి నమూనాలు తీసుకుంటే.. అందులో మాదకద్రవ్యాల ఆనవాళ్లు లభించాయని పోలీసులు చెబుతున్నారు. ఇదే సమయంలో భారత రాష్ట్రపతి నాయకులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్న ఫోటోల్లో.. పోలీసుల పంచనామా పత్రం కనిపిస్తోంది. అందులో మాదకద్రవ్యాల ప్రస్తావనలేదని వారు అంటున్నారు. ఒకవేళ మాదకద్రవ్యాలు వాడకుండా ఉండి ఉంటే రాజ్ వెనుక గోడ నుంచి దూకి పారిపోవాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.. మాదకద్రవ్యాలతో పాటు, విదేశాల నుంచి పరిమితికి మించి దిగుమతి చేసుకున్న మద్యం, క్యాసినో పరికరాలు అక్కడ ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. పోలీసులు పక్కా సమాచారంతోనే అక్కడికి వెళ్లారని.. ఇంకా భారత రాష్ట్రసమితి నాయకులు బుకాయించడం దేనికని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు. కేటీఆర్ కుటుంబంపై వచ్చే ప్రతి విమర్శను సమర్థవంతంగా తిప్పికొట్టే నమస్తే తెలంగాణ.. ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉంది అంటేనే "దాల్ మే కుచ్ కాలా హై" అనే సామెత గుర్తుకు వస్తోందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు.. వాస్తవానికి అక్కడ విపరీతమైన శబ్దాలతో పార్టీ చేసుకుంటున్నారని.. చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలగడం వల్లే పోలీసులకు ఫిర్యాదు చేశారని.. అందువల్లే పోలీసులు దాడులు చేసి పార్టీలో పాల్గొన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు.కొద్దిరోజులుగా తెలంగాణలో వరుస సంఘటనలు జరుగుతున్నాయి. హైడ్రా కూల్చివేతలు కొద్ది రోజులు హడావిడి సృష్టించగా.. ఆ తర్వాత రైతుల రుణమాఫీ.. గురుకులాలకు తాళం.. బెటాలియన్ పోలీసుల ధర్నా.. ఇలాంటి వివాదాలతో అధికార కాంగ్రెస్ పార్టీకి భారత రాష్ట్ర సమితి ఇబ్బంది కలిగిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏదో ఒక రూపంలో నిరసన చేపడుతోంది. దీనికి కేటీఆర్ నాయకత్వం వహిస్తున్నారు. తనకున్న బలమైన సోషల్ మీడియా విభాగం ద్వారా కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందు దోషిగా నిలబెడుతున్నారు. ఇది సహజంగానే అధికార పార్టీకి ఇబ్బందిగా మారింది. అయితే ఇలాంటి సమయంలో కేటీఆర్ బావమరిది రాజ్ వ్యవహారం తెరపైకి రావడంతో అధికార పార్టీకి కాస్త ఉపశమనం లభించింది. దీంతో ఉదయం నుంచి సోషల్ మీడియాలో యుద్ధం జరుగుతోంది. అటు కాంగ్రెస్, ఇటు భారత రాష్ట్ర సమితి పరస్పరం విమర్శలు చేసుకుంటున్నాయి. అయితే ఈ వివాదంలో ఇప్పటివరకు నమస్తే తెలంగాణ ఒక్క వార్త కూడా ప్రచురించకపోవడం.. వెబ్ సైట్ లోనూ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే సమయంలో భారత రాష్ట్ర సమితికి అనుకూలంగా వ్యవహరించే కొంతమంది యూట్యూబ్ జర్నలిస్టులు, ట్విట్టర్ హ్యాండ్లర్స్ మాత్రం కేటీఆర్ బావమరిదికి అనుకూలంగా మాట్లాడడం విశేషం.

# ఒక్కటైన శ్రీనివాసులు...

**కరీంనగర్ :** శ్రీనివాస్ పేరుగల వారంతా ఏకతాటిపైకి వచ్చారు. కరీంనగర్ కు చెందిన వుట్కూరి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మిత్రబృందంగా ఏర్పడ్డారు. శ్రీనివాస్ పేరుతో పదిమందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఆ పేరు గల వారిని అందులో చేర్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 4800 మంది శ్రీనివాసులు అయ్యారు.మూడు వాట్సాప్ గ్రూప్ లు ఏర్పాటు చేసి మానవ సేవే మాధవ సేవగా భావిస్తు సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ శ్రీనివాసుల సేవా సమితి (టిఎస్ఎస్ఎస్) రిజిస్టర్ చేసి ఏడాది పూర్తైన సందర్భంగా కరీంనగర్ లోని టిటిడి కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.తలసేమియా బాధితల కోసం వందమంది రక్తదానం చేశారు. ఎస్పీ స్థాయిలో ఉన్న కరీంనగర్ పోలీస్ ట్రేనింగ్ సెంటర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రక్తదానం శిబిరాన్ని ప్రారంభించగా వందమంది శ్రీనివాసులు రక్తదానం చేశారు. రక్త ధానమే కాకుండా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు.శ్రీనివాస్ పేరు గలవారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 4800 మంది ఉన్నట్లు గుర్తించారు. ఏపీ తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో 12 వేల మంది శ్రీనివాసులు ఉన్నట్లు భావిస్తున్నారు. వారందరినీ టిఎస్ఎస్ఎస్ లోకి చేర్పించి రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. శ్రీనివాస్ పేరు గల వారు పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చేయుత అందించాలని, అదేవిధంగా సాటి మనిషికి సహాయపడే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.శ్రీనివాస్ పేరు గలవారు వివిధ రంగాల్లో ఉన్నారు. డాక్టర్లు ఇంజనీర్లు, ఉద్యోగులు, వ్యాపారులు,దినసరి కూలీలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇలా శ్రీనివాస్ నామధేయం గల వారందరిని టిఎస్ఎస్ఎస్ గొడుగు కిందకు తెచ్చేందుకు వుట్కూరి శ్రీనివాసరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు సమావేశానికి హాజరైన శ్రీనివాసులు. రాబోయే రోజుల్లో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం, పేదలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.మొదటి వార్షికోత్సవం సందర్భంగా 3000 మందితో సమావేశం నిర్వహించిన శ్రీనివాసులు వచ్చే ఏడాది వరకు 10000 మంది శ్రీనివాసులతో సమావేశం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆచార్య దైవజ్ఞ శ్రీనివాస్ కాళేశ్వరం గారి ఆలోచనకు అనుగుణంగా శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో శ్రీనివాస్ నామదేయులు ఒక్క వేదిక పైకి రావడం గొప్ప విషయమన్నారు పిటిసి ప్రిన్సిపల్ శ్రీనివాస్. దీనిని ముందుకు తీసుకుపోవడానికి మన ఆరోగ్యం మన చేతులో అనే నినాదంతో చిరుధాన్యాలను ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకుందామన్నారు.

## ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గురువారెడ్డి

**జగిత్యాల :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గురువారెడ్డి ఎన్నికయ్యారు.ఆదివారం హైద్రాబాద్ లో జరిగిన తెలంగాణా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్ -2 ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు డా. గురువారెడ్డి ఎన్నిక కాగా ఆయనను పలువురు అభినందించారు.

డాక్టర్ గురువారెడ్డి ని జగిత్యాల కు చెందిన ఐఎంఏ డాక్టర్లు, అర్ఎంపి, పిఎంపి డాక్టర్లు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, జగిత్యాల క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, కౌన్సిలర్ నక్క జీవన్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్,అల్లాల సరితా రమేష్ రావు, బింగి రవి, రేపల్లె హరికృష్ణ, జగిత్యాల వర్తక సంఘం అధ్యక్షులు కమాటాల శ్రీనివాస్, చిట్ల అంజన్న,చిట్ల లత, నాగిరెడ్డి రజిత,కూచన నాగజ్యోతి,ఎన్నం మంజుల, తదితరులు అభినందించారు.

# ఔత్సాహిక కళాకారుల ప్రోత్సాహానికి కృషి

**కాకినాడ** సినిమా రంగంలోకి అడుగు పెట్టాలని ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేలా మూవీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కృషి చేస్తామని సినీ నటుడు గౌతమ్ రాజు పేర్కొన్నారు కాకినాడ దంటు కళక్షేత్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక సినిమా రంగంలోని ఔత్సాహి కలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో అసోసియేషన్ ఏర్పాటు చేశానన్నారు కాకినాడ కేంద్రంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కళాకారులను గుర్తించి సంఘ తరఫున సహాయం అందిస్తామని అన్నారు రాష్ట్రంలో చిత్రీకరణలు పెరుగుతున్నాయని ఎక్కడ వారికి అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు చిన్ని సినిమాలను ప్రోత్సహించాలని పార్థోత్సవం నిమిత్తం లేకుండా అవకాశాలు ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు అనంతరం అసోసియేషన్ బ్యానర్ను ఆవిష్కరించారు

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం




**విశాఖపట్నం** ఆనందపురం మండలం గుమ్మడివానిపాలెం హైవే వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆనందపురం నుంచి పెందుర్తి వెళ్తున్న బైక్ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టింది. దీంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి, బైక్ పై కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మరొకరికి తీవ్ర గాయాలుకాగా అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కారు బోల్తా..డ్రైవర్ కు తీవ్ర గాయాలు

**రంగారెడ్డి** గచ్చిబౌలి హెచ్ సీయూ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సును ఓవర్ టేక్ చేయ బోయి ఆటోని ఢీకొని అదుపుతప్పిని స్విఫ్ట్ కారు పల్టి కొట్టింది. డ్రైవర్ కారులో ఇరుక్కున్నాడు. కారులో ఉన్న డ్రైవర్ ను అతికష్టం మీద బయటకు తీసారు. ప్రమాద జమయంలో కారులో ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ పరిస్థితి విషమంగా వుండడంతో చికిత్స నిమిత్తం బీరంగూడ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు కారులోని వ్యక్తులు ఫుల్ గా మద్యం సేవించినట్లు అనుమానిస్తున్నారు.

# యువకుడి దారుణ హత్య



**మేడ్చల్** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ కు చెందిన రాజ్ కుమార్(21) అనే వ్యక్తి గత రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి పంచశీల కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న కంపనీలో లేత్ మెషిన్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. పంచశీల కాలనీ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికుల సహకారంతో మృతుడిని రాజ్ కుమార్ గా గుర్తించారు. రాజ్ కుమార్ గొంతు పై, పొట్ట భాగంలో పదునైన ఆయుధంతో దాడి చేసి దుండగులు హత్యకు పాల్పడ్డారు, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ నరసింహా రాజు తెలిపారు.

# విజయమ్మ ఈ గొడవలను ఆపాలి

**హైదరాబాద్** మాదాపూర్ తన నివాసంలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆస్తుల విషయంలో జగన్, షర్మిల బహిరంగ లేఖలతో రోడ్డెక్కారు. నేను జనసేనాలోకి వచ్చినా, నాకు రాజకీయ భిక్ష పెట్టింది రాజశేఖర్ రెడ్డి.40 ఏళ్లు రాజశేఖర్ రెడ్డి హుందాగా రాజకీయాలు చేసారు. మేము ఆర్థికంగా బలపడ్డాము అంటే కారణం విజయమ్మ. చంద్రబాబు, కూటమి చేస్తుంది అనడం కరెక్ట్ కాదు..మాకు ఏం అవసరం. కుటుంబ తగాదాని కూటమి కి అంటగడుతున్నారని ఆరోపించారు. విజయమ్మ ఈ గొడవలకి ఫుల్ స్టాప్ పెట్టాలి. విజయమ్మ నే జడ్జిమెంట్ ఇవ్వాలి.రాజశేఖర్ రెడ్డి కుటుంబం ఆస్తుల కోసం రోడ్ ఎక్కడం బాధగా ఉంది. ఆడబిడ్డ కంట తడి పెట్టడం మంచిది కాదు. వైవి సుబ్బారెడ్డి, సాయిరెడ్డి పెద్ద మనషులుగా సర్దుబాటు చేయాలి. సమస్యను జటిలం చేసి వైఎస్ కుటుంబం పరువును బజారుకీడుస్తున్నారు. షర్మిల, జగన్ ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. నేను వైసీపీ లో ఆస్తులు సంపాదించుకొని జనసేన లోకి వెళ్లాను అని ప్రచారం చేస్తున్నారు. నేను వైసీపీ లో ఆస్తులు పోగొట్టుకున్నాను తప్ప సంపాదించుకోలేదు.. ఇది జగన్ కి కూడా తెలుసు. నేను ఆస్తులు అమ్ముకున్నాను. నన్ను ఎలక్షన్ ముందే జనసేనలోకి తీసుకోవాలని అనుకున్న అని పవన్ కళ్యాణ్ అన్నారు. నేను మరల వెనక్కి వెళ్ళిపోతున్నాను అని సోషల్ మీడియా లో ప్రచారం చేస్తున్నారు. జగన్ కోసం నా మంత్రి పదవని వదులుకున్నానని అన్నారు.

# మట్టితో చేసిన దీపాంతలు వాడండి

### - మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్** ప్రజలకు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీపావళి పండగ శుభాకాంక్షలు తెలియజేసారు. దీపావళి సందర్భంగా దీపాలు వెలిగించేటప్పుడు మట్టి తో తయారు చేసిన దీపాంతలు వాడాలని విజ్ఞప్తి చేస్తున్నా. పర్యావరణానికి ,ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.. కుల వృత్తులను రక్షించినట్టు ఉంటుంది. బలహీన వర్గాల శాఖ మంత్రిగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. మట్టితో తయారు చేసిన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. మట్టి చాయ్ కప్పులు అయినా ,మట్టి తో తయారు చేసిన వాటర్ బాటిల్స్ వాడుతూ కుమ్మర్లకు ఆర్థికంగా ఉపాధి అవకాశాలు పెరిగేలా అండగా నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

# అదనపు కలెక్టర్ రాంబాబు బదిలీ

### - జగిత్యాల అదనపు కలెక్టర్ గా బీఎస్ లత

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సూర్యాపేట జిల్లా కు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో 70 మంది రెవెన్యూ అధికారుల బదిలీలు కాగా అందులో 24 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, 46 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగి జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న రాంబాబు ను సూర్యాపేట అదనపు కలెక్టర్ బదిలీ చేసిన ప్రభుత్వం అక్కడ పనిచేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లతను జగిత్యాల కు బదిలీ చేశారు. బీఎస్ లత గతంలోనూ జగిత్యాల. జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేశారు.



# కేటీఆర్ బావమరిదికిపోలీసుల నోటీసులు

**హైదరాబాద్** మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలాకు మోకిలా పోలీసులు నోటీసులు జారీ చేసారు. సోమవారం 11 గంటలకు అంతా విచారణకు రావాలంటూ నోటీసులో పేర్కొనారు. ఈ మేరకు అయన ఇంటికి నోటీసులను అంటించారు. విచారణకు రాకపోతే అరెస్ట్ చేస్తామంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేసారు.

# రైల్లో రగడ

### - ప్రయాణికులపై చిరు వ్యాపారస్తులు దాడి




**మదనపల్లె** రైల్ ప్రయాణికులపై చిరు వ్యాపారస్తులు దాడికి దిగారు. 07656 తిరుపతి, గుంతకల్ రైల్లో ఘటన జరిగింది. గొడవ చిన్నపాటి తగాదాతో మొదలైంది. చిరు వ్యాపారస్తులు ఒక్కటై మదనపల్లి స్టేషన్ వద్ద భార్యాభర్తల పై దాడికి దిగారు. అనంతపురం జిల్లా, రాఘవేంద్ర నగర్, కు చెందిన సురేష్ రేణుక భార్యాభర్తలు తిరుపతికి వచ్చి వెళుతుండగా వివాదం మొదలయింది. రైల్వే ప్రయాణికులను చిరు వ్యాపారులు భయభ్రాంతులకు గురిచేసారు

# పెదనెమలిపురిలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్

**పల్నాడు** రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామంలో పోలీసుల కార్డన్ సెర్చ్ జరిపారు. సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించారు.

ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ యం. హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. కార్డెన్ సెర్చ్ లో సబ్ డివిజన్ లోని సీఐ లు, ఎస్సైలు,పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు. డి.ఎస్.పి హనుమంతరావు మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ ఉపేక్షిస్తే కఠిన చర్యలు తప్పవు. గొడవలు,అల్లర్లకు పాల్పడే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తాం. ప్రజలకు చట్టపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు తెలియజేయండి.. 24 గంటల పాటు పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటుంది. ఆవేశంలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. క్షణికావేశంలో చేసే తప్పులకు జీవితాంతం శిక్ష అనుభవించాల్సి వస్తుంది. అలాంటివేమీ లేకుండా అందరూ మంచితనంతో మెలగాలని అన్నారు.

# ఆటిజమ్ పిల్లలు తయారి ఉత్పత్తులను ప్రోత్సహించాలి

**కాకినాడ** ఆటిజం పిల్లలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిందిగా ఆసరా సెంటర్ ఫర్ ఆటిజం వ్యవస్థాపకురాలు సునీత విజ్ఞప్తి చేశారు. ఆటిజం పిల్లలు రూపొందించిన దీపావళి ఉత్పత్తుల ప్రదర్శనను ప్రముఖ ఇంజనీర్ ఎస్.ఎస్. బలరాం.,కాకినాడ జిల్లా.. కాకినాడ ఎన్.ఎఫ్.సి.ఎల్ రోడ్., నున్న ఆనంద హాస్పిటల్ ప్రాంగణంలోని ఆటిజం సెంటర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ పిల్లలకి ఒకేషనల్ శిక్షణ ఎంతో అవసరమని దీనిపై పేరెంట్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద పిల్లలను ఇంట్లో ఉంచకుండా ప్రతిరోజు కొంత సమయం బయట ప్రపంచాన్ని చూపించే విధంగా తీసుకు వెళ్లాలని కోరారు. మానసికంగా వారిలో ఆనందం కలిగించే విధంగా పేరెంట్స్ ప్రత్యేక విషయాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి పిల్లలు ఇలాగే మీరు ఉండరని వీరి ప్రపంచమే వేరుగా ఉంటుందని అయినప్పటికీ వీరి పేరెంట్స్ కి మోటివేషన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. తమ సెంటర్లో పిల్లలు కేవలం 3 నుండి 5 గంటల పాటు ఉంటారని, మిగిలిన సమయాల్లో వారి వారి ఇంట్లో ఏదో విధంగా వారి చేత చిన్న చిన్న పనులను చేయిస్తూ ఆలోచన మరియు జ్ఞాపక శక్తి పెంచే విధంగా కృషి సూచించారు. పిల్లలు తయారు చేసిన దీపావళి వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని వాటిని కొనుగోలు చేయడం ద్వారా వీరి శ్రమ మరియు కృషిని ప్రోత్సహించిన వారు అవుతామన్నారు. ఈ రంగంలో ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వం కూడా ఇటువంటి కేటగిరీలో ఉన్న పిల్లలకు ప్రత్యేక బోధనా సదుపాయాలను కల్పించాల్సిందిగా ఎన్నటినుండో విజ్ఞప్తి చేస్తున్నామని ఆమె గుర్తు చేశారు. వీరందరికీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమన్నారు. ఆటిజం పిల్లలు పనిచేస్తూ ఆనందాన్ని పొందే విధంగా ప్రతి పేరెంటు శ్రద్ధ కనపరచాల్సిన అవసరం ఉంది అన్నారు. వీరందరి చేత మరిన్ని ఉత్పత్తులను తయారు చేయడానికి అవసరమైన పరికరాలు దిగుమతి చేసుకుంటున్నామని ఆమె చెప్పారు. ఈ ప్రదర్శన ఈనెల 30 సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందని వివరించారు. ఈ పిల్లలు వస్తువులను తయారు చేసే సమయంలో పేరెంట్స్ గా తమ సహాయ సహకారాన్ని కూడా అందించడం జరిగిందని, వారి ఏకాగ్రతతో చేసిన వస్తువులు చూపరులను ఆకట్టుకునే విధంగానూ పర్యావరణహితంగానూ ఉందన్నారు. ఇతర వివరాలకోసం 9246644749, 98482 29911 లో సంప్రదించవచ్చన్నారు.

ఇంజనీర్ బలరాం మాట్లాడుతూ ఇటువంటి పిల్లల కోసం ప్రత్యేక సెంటర్ ను నిర్వహిస్తున్నారని వాటిలో బోధనతో పాటు పరిసరాలలో ఏ విధంగా నడుచుకోవాలో అన్న అంశంపై కూడా వివరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంజనీర్ నిహారిక(విశాఖపట్నం), అరవింద్, ఎం. నవీన్ తో పాటు పలువురు పేరెంట్స్ కూడా పాల్గొన్నారు.

## టీఎస్ జెయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా

# బాపిరెడ్డి ఎన్నిక

**సిద్దిపేట, అక్టోబర్ 28 :** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం సోమవారం శివాన్ భవ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు బాపిరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి నేషనల్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు ముఖ్యఅతిథులు హాజరయ్యారు. సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టులందరికి ఇల్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే జర్నలిస్టుల నుంచి ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మన కోసం మనం, జనం కోసం మనంగా జర్నలిస్ట్ లు పని చేయాలని పురుషోత్తం అన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షునిగా చింతలపల్లి బాపిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో పది రోజులలో పూర్తి స్థాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా బాపిరెడ్డి మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టీఎస్ జెయు జిల్లా నాయకులు కొత్తపల్లి రాజేందర్, గుడి భాను ప్రకాష్, బడుగు భాస్కర్, గుడిసె ప్రభు, బచ్చని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

**అమలాపురం** ఇటీవల ఎల్ఐసి పాలసీలలో మరియు ఏజెంట్ కమిషన్ స్ట్రక్చర్ లో తీసుకువచ్చిన మార్పులకు నిరసనగా ఎల్ఐసి ఆల్ ఇండియా ఏజెంట్ల ఫెడరేషన్ పిలుపు మేరకు అమలాపురంలో ఏజెంట్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్లు మాట్లాడుతూ ఎల్ఐసి లో తీసుకువచ్చిన మార్పుల వలన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పాలసీలు దూరం చేయడం జరిగిందన్నారు. వయోపరిమితి తగ్గించడం వలన పేద, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు ఎల్ఐసి పాలసీలకు దూరమయ్యారన్నారు. ఎల్ఐసి పై ఆధారపడి బతుకున్న ఏజెంట్ల కమిషన్ తగ్గించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి, ఐ.ఆర్.డి.ఎ.ఐ నిర్ణయాలలో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని ఏజెంట్లు కోరారు.

# రతన్ టాటా ఉదారత్వం విన్నారా...

**ముంబై :** మొన్న రతన్ టాటా గతించిన తర్వాత మనం అనేక కథనాల్లో చెప్పుకున్నాం.. ఆయన ఎంత గొప్పవాడో.. ఆయన మనసు ఎంత గొప్పదో.. ఆయన ఆలోచనలు ఎంతటి విశాలమైనవో.. అంతటి కరోనా కాలంలో ప్రపంచం మొత్తం ఇబ్బంది పడుతుంటే.. తను మాత్రం బయటికి వచ్చాడు. ఓ అదాని తన వ్యాపార సామ్రాజ్యాన్ని అంతకంతకు విస్తరిస్తుంటాడు. ప్రభుత్వాలకు వందల కోట్లు విరాళంగా ఇచ్చి తన సిమెంట్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయించుకుంటాడు. అది ఒక రకమైన క్రోనీ క్యాపిటలిజం. ఇక అంబానీ అంటారా.. వేడుకలకు, విలాసాలకు మాత్రమే ప్రసిద్ధి.. తను ఎన్ని లక్షల కోట్లు సంపాదించినా.. సమాజానికి ఏమీ ఇవ్వడు. ఒకవేళ ఇచ్చినా అందులోనూ వ్యాపారమే ఉంటుంది.. అందుకే వారు వ్యాపారవేత్తలుగానే మిగిలిపోయారు. కానీ ఈ జాబితాలో రతన్ టాటా పూర్తి విభిన్నం.మొన్న రతన్ టాటా గతించిన తర్వాత మనం అనేక కథనాల్లో చెప్పుకున్నాం.. ఆయన ఎంత గొప్పవాడో.. ఆయన మనసు ఎంత గొప్పదో.. ఆయన ఆలోచనలు ఎంతటి విశాలమైనవో.. అంతటి కరోనా కాలంలో ప్రపంచం మొత్తం ఇబ్బంది పడుతుంటే.. తను మాత్రం బయటికి వచ్చాడు. ఏకంగా 150 కోట్లు ఇచ్చాడు. ఈ దేశం కోసం.. ఈ దేశ ప్రజల బాగుకోసం తన యావత్ ఆస్తి మొత్తం ఇస్తానని ప్రకటించాడు. అంతేనా అంతకుముందు ఉగ్రవాదుల దాడి వల్ల ముంబై తాజ్ హోటల్ ధ్వంసం అయితే.. దాన్ని ఆధీనంలోకి తీసుకున్నాడు. పూర్తి రూపం వచ్చేలా చేసాడు.. ఇలా చెప్పుకుంటూ పోతే రతన్ టాటా వ్యక్తిత్వం వర్ణనకు అందదు. అటువంటి వ్యక్తి అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశాడు.. గొప్పవాళ్లు కన్నుమూస్తే ఒక జాతి మొత్తం శోకిస్తుంది. అతని జ్ఞాపకాల్లో మునిగి తేలుతుంది. రతన్ టాటా మరణించినప్పుడు కూడా ఈ దేశం మొత్తం శోక తప్త హృదయంతో నివాళు లర్పించింది. వయస్సు సంబంధం లేకుండా.. రతన్ టాటా ను తమ వాట్సాప్ డీపీలుగా పెట్టుకుంది. ఒక మనిషి చేసిన మంచి అతడిని వందేళ్లపాటు బతికిస్తుంది అంటారు. అలాంటి పని రతన్ టాటా చేశాడు కాబట్టే ఇవాల్టికి అతడిని మర్చిపోలేకపోతోంది ఈ భారత జాతి. ఇకపై మర్చిపోయే అవకాశం కూడా లేదు. ఉన్నప్పుడు గొప్ప గొప్ప పనులు చేసి దేశ యవనిక మీద చెరగని ముద్రవేసిన రతన్ టాటా.. తన బతికి ఉన్నప్పుడు రాసిన వీలునామా ద్వారా కూడా అదే స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయగలుగుతున్నారు. ఇంతకీ ఆయన ఆ వీలు నామాలో ఏం రాశారంటే..ఇప్పటి మార్కెట్ లెక్కల ప్రకారం టాటా గ్రూప్ కంపెనీల ఆస్తుల విలువను లెక్కిస్తే 30 లక్షల కోట్లకు పైగా ఉంటుంది. టాటా గ్రూప్ ను ఈ స్థాయికి చేర్చడం వెనక రతన్ టాటా తీవ్రంగా కృషి చేశారు. ఆయన నేతృత్వంలో టాటా గ్రూప్ అనేక వ్యాపారాల్లోకి ప్రవేశించింది. లక్షల మందికి ఉపాధి కల్పించింది. కొత్త కొత్త అవకాశాలను సృష్టించింది. రతన్ టాటా కన్నుమూయడంతో.. టాటా గ్రూప్ కు తదుపరి వారసుడిగా రతన్ సవతి సోదరుడు నోయల్ టాటా నియమితులయ్యారు. ఈ క్రమంలో రతన్ టాటా ఆస్తులకు సంబంధించి మొన్నటిదాకా ఒక చిక్కు ప్రశ్న ఉండేది. అవి ఎవరికి చెందాలనేది ఒకింత ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలో రతన్ టాటా తను సంపాదించిన ఆస్తుల్లో ఎక్కువ శాతం విరాళాలకే కేటాయించారు. దాంతోపాటు కొన్ని దాతృత్వ సంస్థలకు రాసిచ్చారు.టాటాకు దాదాపు పదివేల కోట్ల రూపాయల ఆస్తి ఉంది. అలీబాగ్ ప్రాంతంలో రెండు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అతిపెద్ద భవంతి ఉంది. ముంబైలోని జుహు తారా రోడ్ లో రెండు అంతస్తుల భవనం ఉంది. ఫిక్స్ డ్ డిపాజిట్ల రూపంలో 350 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. ఇక టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయినటువంటి టాటా సన్స్ లో 0.83 శాతం వాటా రతన్ కు ఉంది. అయితే తన సంపదలో ఎక్కువ శాతం ఎండోమెంట్ ఫౌండేషన్ కు రతన్ తను జీవించి ఉన్నప్పుడే బదిలీ చేయించారు.రతన్ కు కుక్కలను ఇష్టంగా చూసేవారు. వాటిని అమితంగా ప్రేమించేవారు. ఆయనకు జర్మన్ షెఫర్డ్ టిటో అనే పెంపుడు కుక్క ఉండేది. దానికోసం "అన్లిమిటెడ్ కేర్" పేరుతో ఒక వీలునామా రాశారు. అందులో ప్రత్యేక నిబంధనలు రూపొందించారు. ఆ కుక్కను రాజన్ షా అనే వ్యక్తి చూసుకుంటారు. ఆ కుక్క తో పాటు వంట మనిషి సుబ్బయ్య, రాజన్ షా కు రతన్ తన ఆస్తిలో కొంత భాగాన్ని ఇచ్చారట. రతన్ టాటాకు అత్యంత ఆత్మీయుడైన శంతను నాయుడుకు ఆస్తిలో కొంత భాగం ఇచ్చారట. మీరు మాత్రమే కాకుండా జిమ్మీ టాటా, సవతి సోదరులు షిరీన్, డీనా జెజిబోయ్ తో పాటు ఇంట్లో సిబ్బందికి కూడా రతన్ వాటాలు ఇచ్చారట.రతన్ బతికి ఉన్నప్పుడు వీధి శునకాల కోసం



ఎంతగానో తాపత్రయపడేవారు. కుక్కల కోసం హాస్పిటల్స్ కట్టించారు. ముంబైలోని ఐదు అంతస్తుల భవనంలో పెట్ ప్రాజెక్టు పేరుతో కుక్కల కోసం ఒక సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.. మొత్తంగా చూస్తే రతన్ టాటా తన రక్తసంబంధీకుల నుంచి మొదలు పెడితే కుక్కల వరకు ఆస్తుల్లో వాటాలు ఇచ్చారు. విశ్వ మానవుడిగా అవతరించారు. అందుకే అంబానీలు, అదానీలు డబ్బు సంపాదించవచ్చు గాక.. విఖ్యాత వ్యాపారవేత్తలుగా పేరు పొందవచ్చు గాక.. కానీ వారు ఎప్పటికీ రతన్ టాటా కాలేరు. కాబోరు. అలా అవ్వడానికి ప్రయత్నం కూడా చేయరు.

# పోలీస్ వర్సెస్ పోలీస్

**నల్గొండ :** కొండాపూర్ 8వ బెటాలియన్ ఎదుట పోలీసు కానిస్టేబుళ్ల ఆందోళన. డిచ్ పల్లి వద్ద రోడ్డుమీదికి వచ్చిన బెటాలియన్ కుటుంబ సభ్యులు. మామునూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు.. ఇవి రెండు రోజులుగా మీడియాలో ప్రముఖంగా కనిపిస్తున్న, వినిపిస్తున్న వార్తలు.ఇక శనివారమైతే నల్గొండ జిల్లాలోని అనపర్తి బెటాలియన్ లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వివాదానికి కారణమైంది. నల్గొండ రూరల్ ఎస్సై సైదా బాబును అరెస్టు చేయాలని కానిస్టేబుల్ నిరసనకు దిగడం సంచలనాన్ని కలిగించింది. "శాంతియుతంగా మేము నిరసన తెలుపుతున్నాం. మా కుటుంబ సభ్యుల మీద అసభ్యకరంగా మాట్లాడారు. నోటికి వచ్చినట్టు తిట్టారు. వెంటనే సైదాబాబును సస్పెండ్ చేయాలని" కానిస్టేబుల్ డిమాండ్ చేశారు. అయితే ఆ సమయంలో సైదాబాబు వద్దకు కానిస్టేబుళ్లు రావడంతో బెటాలియన్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. ఆ తర్వాత వారందరినీ అక్కడి నుంచి పంపించారు.. ఇలాంటి సంఘటనలు గత రెండు రోజుల నుంచి తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో చర్చ మొదలైంది. రాష్ట్రంలోని వివిధ బెటాలియన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబాలు "వి వాంట్ ఏక్ పోలీస్" డిమాండ్ చేస్తున్నాయి. గౌరవప్రదమైన పోలీసు ఉద్యోగంలో ఉన్నవారు కూలీలుగా మారుతున్నారని.. వారితో అధికారులు వెట్టిచాకిరి చేస్తున్నారని కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల, డిచ్ పల్లి, మామునూరు, కొండాపూర్ వంటి ప్రాంతాలలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏక్ స్టేట్ ? ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగానే తెలంగాణ రాష్ట్రంలోనూ ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని.. తమ భర్తలకు వెట్టి చాకిరి నుంచి ముక్తి కల్పించాలని కోరుతున్నారు. వాస్తవానికి పోలీసులుంటే క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారు. అలాంటి పోలీసులు ఆందోళనకు దిగడం నివ్వెర పరుస్తోంది. పోలీసుల్లో ఎన్నో విభాగాలు ఉంటాయి. అందులో బెటాలియన్ అనేది ప్రత్యేకంగా ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నక్సలైట్ల ఏరివేత లక్ష్యంగా బెటాలియన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. అయితే తెలంగాణలో నక్సల్స్ సమస్య తగ్గిపోయిన తర్వాత బెటాలియన్ వ్యవస్థ ఒకప్పటిలాగా చురుకుగా పనిచేయడం లేదు. దీంతో వారిని వివిధ విధుల కోసం ప్రభుత్వం ఉపయోగిస్తోంది. అయితే పోలీసుల్లో మిగతా వారి కంటే ఎక్కువగా బెటాలియన్ విభాగంలో పనిచేసే వారికి జీతభత్యాలు అందేది బహిరంగ రహస్యమే. ఈ బెటాలియన్లో గ్రేహౌండ్స్ అనే విభాగానికి ఎక్కువగా చెల్లింపులు చేస్తారు. వీరికి ప్రత్యేకంగా భత్యాలు లభిస్తాయి.అయితే బెటాలియన్ లో పనిచేసే వారిని తరచూ వివిధ పోలీస్ స్టేషన్లు తిప్పడం.. సరిగ్గా సెలవులు ఇవ్వకపోవడం.. బెటాలియన్ లో జరిగే పనులు కూడా వారి ద్వారా చేయించడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల కొన్ని బెటాలియన్ల పరిధిలో చావు డప్పులు కూడా కానిస్టేబుళ్ల చేయడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆగ్రహం తారస్థాయికి చేరింది. అందువల్లేవారు నిరసనకు దిగారు. ఏక్ స్టేట్ ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న పోలీసు విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరుతున్నారు. అయితే గత కొద్దిరోజులుగా బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలు తీవ్ర రూపు దాల్చాయి. వీటిని సహజంగానే ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి అనుకూల మీడియా ప్రధానంగా చూపిస్తోంది. దీంతో ఈ సమస్య ఒకసారిగా తీవ్రతను దాల్చుకుంది. మరోవైపు కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆందోళనలను నియంత్రించడానికి ఇతర పోలీసులు రంగంలోకి దిగాల్సి వస్తుంది. ఫలితంగా పోలీసు వర్సెస్ పోలీస్ అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.. ఈ సమస్యకు తాత్కాలిక పరిష్కార మార్గంగా ప్రభుత్వం కానిస్టేబుళ్ళ బదిలీలను నిలిపివేసింది. సమస్యల పరిష్కారం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని డిజిపి ప్రకటించారు.

### బెటాలియన్ పోలీసుల ఆందోళన ఎందుకు ఏక్ పోలీస్..

ఏక్ పోలీస్.. అసలు నిబంధనలు ఏం చెబుతున్నాయో పరిశీలిస్తే.. తెలంగాణలో మొత్తం 13 బెటాలియన్లు ఉన్నాయి. వాటిలో అధికారులు, సిబ్బంది కలిసి ఒక్కో బెటాలియన్లో వెయ్యి మంది వరకు ఉంటారు. సాధారణంగా పోలీస్ శాఖలో సివిల్, ఆర్మ్డ్ రిజర్వు(ఏఆర్), స్పెషల్ పోలీసు విభాగాలు ఉంటాయి. నేర విచారణ, శాంతిభద్రతల పర్యవేక్షణ, నేర విచారణ, నేరాల నిరోధం, నేరస్తులను గుర్తించడం వంటి విధుల్లో సివిల్ పోలీసులు పనిచేస్తారు. ఇక బందోబస్తు విధులు నిర్వహించేది ఆర్మ్డ్ పోలీసులు. టీజీఎస్పీ పోలీసు సిబ్బంది శాంతిభద్రతల విధులు నిర్వహిస్తుంటారు. ఐదేళ్లు ఏఆర్లో పనిచేసిన తర్వాత తమను సివిల్లోకి మార్చాలని పోలీసులు కోరుతున్నారు. అయితే ఇందుకు రాష్ట్ర సర్వీస్ నిబంధనలు అంగీకరించవు.ఇక సెలవుల విషయంలో కూడా ఏఆర్ పోలీసుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. సివిల్ పోలీసులకు వారానికి ఒక రోజు సెలవు ఇస్తుండగా, ఏఆర్ పోలీసులకు మాత్రం మూడు వారాలకు ఒక రోజు సెలవు ఇస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తున్న బెటాలియన్ పోలీసులకు ఇప్పుడు సెలవులు కూడా రద్దు చేయడంపై వారి కుటుంబాలు రోడ్డెక్కుతున్నాయి. ఉద్యోగులు ఎవరికీ లేని విధంగా టీసీఎస్పీ సిబ్బందికి సరెండర్ లీవులు, అడిషనల్ సరెండర్ లీవులు మంజూరు చేశారు. పండుగలు, సెలవుల సందర్భాల్లో టీజీఎస్పీ సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండడంతో వీరికి ప్రత్యేక సెలవులు ఉంటాయి. ఇక వేతనాలు, భత్యాలు, ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో పోలిస్తే అధికంగా ఉన్నాయి. భద్రత, ఆరోగ్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు.యూనిఫాం ధరించే పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి. కానీ, బెటాలియన్ పోలీసులు కొందరు ఆందోళనతో ఆ శాఖకు మచ్చ తెచ్చేలా వ్యవహరిస్తున్నారు. అన్నిరకాలుగా మిగతా పోలీసులకన్నా ప్రత్యేక సదుపాయాలు ఉన్నా.. సెలవుల విషయంలో పోలీస్ కుటుంబాలు రోడ్డెక్కడం వెనుక పోలీసులు ఉన్నారని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలోనే చర్యలకు ఉపక్రమించింది. 116 మంది బెటాలియన్ పోలీసులను విధుల నుంచి తప్పించింది.

# హాట్ టాపిక్‌గా కేసీఆర్ మౌనం

**హైదరాబాద్ :** రాజకీయ వ్యూహాల్లో కేసీఆర్ మౌనం ఓ హాట్ టాపిక్. ఉద్యమ సమయం నుంచి కూడా కేసీఆర్ ఎక్కువగా మీడియాలో కనిపించేందుకు ఇష్టపడరు. సందర్భం వచ్చినప్పుడు..తాను మాట్లాడక తప్పదనుకున్నప్పుడు మాత్రమే ఆయన మీడియా ముందుకు వస్తారు.పార్టీ క్యాడర్‌కు బలమైన సందేశం ఇవ్వాలనుకుంటే..జోష్ నింపాలనుకుంటే సమయం, సందర్భం చూసి మాట్లాడుతారు. సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు. ఇలా దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన మౌనంగా ఉన్నా వార్తే? నోరు తెరిచినా వార్తే అనేలా సాగాయి తెలంగాణా పాలిటిక్స్. పదేళ్ల అధికారం తర్వాత ప్రతిపక్షంగా బిఆర్ ఎస్ మారిన తర్వాత నుండి కేసీఆర్ సైలెంట్ అయిపోయారు.పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొంత హడావుడి చేసినా? ఆ తర్వాత మళ్లీ మౌనం దాల్చారు. రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నో ఇష్యూస్ ఉన్నాయి. రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని బీఆర్ఎస్సే ఆరోపిస్తోంది. పైగా నాలుగు వేల పెన్షన్ అమలులోకి రాలేదు. హైడ్రా, మూసీ గొడవ అయితే రెగ్యులర్ అయిపోయింది. మరి ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ రియాక్ట్ కాకపోవడానికి కారణం ఏంటన్న ది హాట్ టాపిక్గా మారింది. అధికార పార్టీకి టైమ్ఇస్తున్నారా..? సమయం కోసం ఎదురు చూస్తున్నారా..? కేసీఆర్మౌనం ఎందుకంటూ అధికార కాంగ్రెస్లో..ఇటు బీఆర్ఎస్ క్యాడర్, లీడర్లలో చర్చ జరుగుతోంది.పార్లమెంట్ ఎన్నికల తర్వాత..కేటీఆర్, హరీశ్రావే పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. ప్రతీ రోజు పబ్లిక్లో ఉంటున్నారు. కానీ కేసీఆర్ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. ప్రెస్ నోట్ కూడా రిలీజ్ చేయడం లేదు. దీంతో కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి ఎప్పుడు వస్తారన్నది ఆసక్తి రేపుతోంది. ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్ లోనే పడుకుంటున్నారని అధికార పార్టీ విమర్శలు చేస్తున్నా మౌనమే ఆయన సమాధానమవుతుంది. లేటెస్ట్ గా మంత్రి పొంగులేని శ్రీనివాస్ రెడ్డి బ్లాస్టింగ్ న్యూస్ ఉంటుందని.. దీపావళి లోపు ఏదో సంచలనం జరగబోతుందన్నట్లుగా స్టేట్మెంట్ ఇచ్చారు.దీనిపై కేటీఆర్ స్పందించారే తప్ప..కేసీఆర్ మౌనం వీడటం లేదు. ఎమ్మెల్యేల వలస నుంచి ఇప్పుడు పొంగులేటి వ్యాఖ్యల వరకు అధికార పార్టీ బీఆర్ఎస్ను ఇరకాటంలో పెట్టాలని ప్రయత్నం చేస్తున్నా..కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదన్న చర్చ గులాబీ పార్టీలోనూ జరుగుతోంది.

అయితే వచ్చే ఎన్నికల వరకు బీఆర్ఎస్ను నడిపించేది కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరేనా అన్న డిస్కషన్ వస్తోంది. కేటీఆర్, హరీశ్రావుకే గులాబీ దళపతి పార్టీ బాధ్యతలు అప్పగించారని..వాళ్లే అంతా చూసుకుంటారన్న టాక్ వినిపిస్తోంది.

తప్పదు అనుకున్నప్పుడు మాత్రమే కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వస్తారని ఓ చర్చ జరుగుతోందిమరోవైపు కేసీఆర్ మౌనం వెనక ఉన్న కారణాలపై పొలిటికల్ ఎనలిస్టులు ఎన్నో రకాలు విశ్లేషిస్తున్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు అయితే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇవ్వాలని గులాబీ బాస్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే రాష్ట్రంలో ఎన్నో ఇష్యూస్ ఉన్నా విపక్ష నేతగా ఉన్న కేసీఆర్ సైలెంట్గానే ఉంటున్నారని చెప్పుకొస్తున్నారు. గడువు ఇవ్వకుండా ప్రభుత్వ వైఫల్యాలను విమర్శిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావిస్తున్నారట కేసీఆర్.మీడియా ముందు కనిపించకపోయినా ఫాంహౌస్ నుంచే పార్టీ నేతల ద్వారానే రాజకీయాలను నడిపిస్తున్నారు కేసీఆర్. సీఎం రేవంత్ రెడ్డి సహా నేతలంతా కేసీఆర్ టార్గెట్గా రెచ్చగొట్టేలా విమర్శలు చేస్తున్నా కాంగ్రెస్ నేతల ట్రాప్లో పడటం లేదు గులాబీ దళపతి. అయితే మరో మూడు నెలల్లో సార్ ఫీల్డ్లోకి దిగుతారని చర్చించుకుంటున్నారు బీఆర్ఎస్ లీడర్లు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై డిసెంబర్ 7నాటికి ఏడాది పూర్తికానుంది. ఆ తర్వాతే కేసీఆర్ ప్రజా ఉద్యమాలకు మొదలుపెడుతారని అంటున్నారు

.ఓ వైపు ప్రభుత్వ తీరుపై పోరాటం చేస్తూనే.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టే వ్యూహరచన చేస్తున్నారట కేసీఆర్. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఏప్రిల్ 27వరకు సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీల నియామకాన్ని పూర్తి చేసి..ఇక ప్రభుత్వ వైఫల్యాలపై కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నారట. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా అమలు చేయని హామీలపై భారీ సభ నిర్వహించాలని కూడా గులాబీ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. సెంటిమెంట్లకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే కేసీఆర్ పీడ దినాలు అయిపోయాక సంక్రాంతి తర్వాత..ప్రజాక్షేత్రంలోకి దిగాలని నిర్ణయించుకున్నారట.

## పండ్ల దుకాణంపై దూసుకెళ్లిన కారు..

# తప్పిన పెను ప్రమాదం



**నల్గొండ** నేరేడుచర్ల లోని ప్రధాన చౌరస్తాలో ఆదివారం రాత్రి మిర్యాలగూడ నుండి వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా వస్తు ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణంపై కి దూసుకు వెళ్ళింది. ఈ ఘటనలో పండ్ల దుకాణం వద్ద నలుగురికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన 108 లో ఆసుపత్రికి తరలించారు. పొనుగోడుకు చెందినదిగా అనుమానిస్తున్న వాహనం ప్రధాన కూడలి వద్ద జనసంచారం రద్దీగా ఉన్న సమయంలో వేగంగా రావడం.. పండ్ల దుకాణం పైకి దూసుకు వెళ్లడం..పక్కనే స్ట్రీట్ ఫుడ్ నిర్వహిస్తున్న ప్రాంతంలో పదుల సంఖ్యలో జనం అల్పాహారం స్వీకరిస్తున్న సమయంలో ఇలా జరగడంతో స్థానికులు ఆందోళన చెందారు.అయితే తృటి ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పండుగ సీజన్ కావడం ప్రధాన చౌరస్తా వద్ద పోలీసులు నియమించకపోవడంతో తర చుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

# రేవ్ పార్టీలో అడ్డంగా బుక్కైనట్టేనా

**హైదరాబాద్ :** జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీకి సంబంధించి పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ లో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. ఎఫ్ఐఆర్ ద్వారా ఉదయం నుండి డ్రగ్స్ వినియోగంపై అనుమానాలు ఉండగా, తాజాగా ఎఫ్ఐఆర్ లో తెలిపిన అంశాల ఆధారంగా డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ధృవీకరించినట్లైంది.జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీ కేసు అంతు తేల్చేందుకు పోలీసులు పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో రేవ్ పార్టీలో పాల్గొన్న ఏ ఒక్కరిని వదిలి పెట్టకూడదన్న లక్ష్యంతో దర్యాప్తును ఎస్ఓటి పోలీసులు వేగవంతం చేశారు. ఇక పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రేవ్ పార్టీకి సంబంధించిన ఎన్నో విషయాలు వెల్లడయ్యాయి.ఎఫ్ఐఆర్ ఆధారంగా.. నిన్న రాత్రి జన్వాడలోని తన ఫామ్ హౌస్ లో దీపావళి పార్టీ ఇస్తున్నట్లు రాజ్ పాకాల తన సన్నిహితులకు సమాచారం అందించారు. సుమారు రాత్రి 8.30 గంటల సమయంలో అందరూ ఫామ్ హౌస్ వద్దకు చేరుకున్నారు. అదే క్రమంలో రాజ్ పాకాల కంపెనీలకు సీఈఓ వ్యవహరిస్తున్న విజయ్ మద్దూరి కూడా అక్కడికి చేరుకున్నారు. కొద్ది నిమిషాల్లోనే పార్టీ ప్రారంభం కాగా, ఎస్ఓటీ పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు, స్నిఫర్ డాగ్స్ తో రాత్రి 11 గంటల సమయంలో దాడి చేశారు.తనకు సన్నిహితుడు, కంపెనీలకు సీఈవోగా వ్యవహరిస్తున్న విజయ్ మద్దూరిని రేవ్ పార్టీకి ఆహ్వానించిన రాజ్ పాకాల, స్వయంగా విజయ్ కు కొకైన్ అందించినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ లో పేర్కొన్నారు. పోలీసుల తనిఖీ సమయంలో విజయ్ మద్దూరి అనుమానితంగా ఉన్న నేపథ్యంలో, తమ వద్ద గల డ్రగ్స్ డిటెక్టివ్ టెస్ట్ కిట్ ఆధారంగా అక్కడే పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు పాజిటివ్ వచ్చిన సందర్భంగా పోలీసులు, విజయ్ మద్దూరిని అదుపులోకి తీసుకున్నారు. రేవ్ పార్టీకి సంబంధించిన అన్ని అంశాల గురించి విజయ్ మద్దూరిని పోలీసులు విచారిస్తున్నారు. ఉదయం నుండి డ్రగ్స్ తీసుకున్నారా లేదా.. అనే ప్రశ్నలకు ఎఫ్ఐఆర్ లో పోలీసులు నమోదు చేసిన అంశాల ఆధారంగా సమాధానం ఇచ్చినట్లైంది. ఇంతకు కొకైన్, రాజ్ పాకాలకు ఎక్కడి నుండి చేరింది? దీని వెనక ఉన్న ముఠా ఎవరు? ఎన్నేళ్ల నుండి డ్రగ్స్ సరఫరా అవుతుందనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా ఎ2గా రాజ్ పాకాలపై కేసు నమోదు చేసిన పోలీసులు, తమ అదుపులో ఉన్న మహిళలకు డ్రగ్స్ డిటెక్టివ్ టెస్ట్ లు నిర్వహించేందుకు ప్రయత్నించగా, వారు నిరాకరిస్తున్నట్లు సమాచారం. ఎలాగైనా అందరికీ డ్రగ్స్ డిటెక్టివ్ పరీక్షలు నిర్వహించేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు.

# సిటీ మొత్తం మెట్రో పరుగులు

హైదరాబాద్, అక్టోబరు 28, (న్యూస్ పల్స్): తెలంగాణ రాష్ట్ర రాజధాని లో ఇప్పటికే మెట్రో రైళు ,, ప్రజా రవాణా వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు ఒక్క క్షణం తీరిక లేకుండా, మెట్రో రైళ్లు నిరంతరం హైదరాబాద్ సిటీలో చక్కర్లు కొడుతూనే ఉంటాయి. విద్యార్థులు, పలు ప్రైవేట్ జాబ్ లలో రాణించేవారికి మెట్రో రైలు సదుపాయం వరమని చెప్పవచ్చు. అటువంటి మెట్రో వ్యవస్థను హైదరాబాద్ నగరంలో మరింత విస్తృత పరిచేందుకు తెలంగాణ కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు.హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికిందంటే అది మెట్రో రైలు వ్యవస్థతోనే. ప్రతి రోజూ లక్షల మంది ప్రయాణీకులు మెట్రో రైలులో ప్రయాణం సాగిస్తున్నారంటే, నగరవాసులు ఈ సదుపాయాన్ని ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారో చెప్పవచ్చు. అందుకే కాబోలు మెట్రో రైళ్ల వ్యవస్థను మరింత విస్తృత పరిచేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మూడు లైన్ల ఆధారంగా రవాణా వ్యవస్థలో విస్తృత సేవలు అందిస్తున్న మెట్రో.. ఇక మున్ముందు నగరంలోని అన్ని మూలలకు విస్తరించనుంది. ఈ మేరకు కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు ప్రకటించారు. సుదీర్ఘంగా సాగిన కేబినెట్ మీటింగ్లో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సీఎం చర్చించారు. ప్రధానంగా మెట్రో రైలు రెండో దశ విస్తరణకు సంబంధించి డీపీఆర్ కు కేబినెట్ భేటీలో ఆమోదం లభించింది.ఇక మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి మొత్తం 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మించాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలుపగా, నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగోల్ నుండి శంషాబాద్, రాయదుర్గం నుండి కోకాపేట్, ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణగుట్ట, మియాపూర్ నుండి పటాన్ చెరువు, ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఇలా మొత్తము 76.4 కిలోమీటర్ల మేరకు మెట్రో రవాణా వ్యవస్థను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాదు ఈ ప్రాజెక్టు కోసం రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి డీపీఆర్ ను కేంద్రానికి పంపించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం శుభ పరిణామం.కేబినెట్ భేటీలో తీసుకున్న ఈ నిర్ణయంతో హైదరాబాద్ నగరవాసుల మెట్రో పూర్తి కల నెరవేరుతుందని చెప్పవచ్చు. కేంద్రం నుండి ఆమోదం రాగానే, ఇక చకచకా మెట్రో రైలు రెండో దశ పనులు ప్రారంభం కానున్నాయని చెప్పవచ్చు.

# దగా..దగా...

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్ బాధితులు వరుసగా బయటకొస్తున్నారు. ఈడీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారంలోని మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధితులు ఫిర్యాదు చేయగా, తాజాగా వట్టినాగులపల్లిలోని శంకర్ హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఈడీని కలిసింది. రూ.20 వేల కోట్ల భూమిని దోపిడీ చేశారని శంకర్ హిల్స్ అసోసియేషన్ సభ్యులు అంటున్నారు. వట్టినాగులపల్లిలోని సర్వే నెంబర్ 111 నుంచి 179లో 460 ఎకరాల 6 గుంటల ల్యాండ్‌లో భారీ కుంభకోణం జరిగిన్నట్లు ఈడీకి ఫిర్యాదు చేశారు.గతంలో శంకర్ హిల్స్ ప్లాట్ పర్చేసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 460 ఎకరాలు భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిని 3 వేల 328 ప్లాట్స్‌గా మార్చి విక్రయించింది. అయితే, అమోయ్ కుమార్ మాత్రం కొనుగోలు చేసిన ఓనర్ల పేర్లను ధరణిలో నమోదు చేయలేదు. తిరిగి రైతుల పేర్ల మీదకే మార్చి, తర్వాత ఫినిక్స్ సంస్థకు అప్పగించారు. దీంతో 3 వేల 328 మంది దాకా ప్లాట్ ఓనర్లు రోడ్డున పడ్డామంటున్నారు. ఈ ల్యాండ్ విలువ 20 వేల కోట్లపైనే మార్కెట్ విలువ ఉంటుంది. ఆ భూమిని అమోయ్ అక్రమార్కులకు కట్టబెట్టాడని ఆరోపిస్తున్నారు.అమోయ్ కుమార్ అరాచకాలపై ఈడీకి ఇప్పటికే రంగారెడ్డి జిల్లా తట్టి అన్నారంలోని మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధితులు ఫిర్యాదు చేశారు. అమోయ్ కుమార్ ధరణిని అడ్డు పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. 200 ఎకరాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని వాపోయారు. తమ ప్లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేశారని ఫిర్యాదు చేశారు. హైకోర్టు స్టే ఆర్డర్ ఉన్నా అధికారులు పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు రిజిస్ట్రేషన్, రాత్రికి రాత్రే పత్రాలు సృష్టించారు అని వాపోతున్నారు బాధితులు. ఇదే సమయంలో శంకర్ హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ కూడా ఫిర్యాదు చేయడంతో అమోయ్ సాగించిన లీలలు ఇంకెన్ని ఉన్నాయన్న చర్చ జరుగుతోంది.

# ఇంకా ఆగని ఆస్తి చిచ్చు

**విజయవాడ :** జగన్‌తో ఉన్న ఆస్తుల వివాదంలో అసలేం జరిగిందో వైఎస్ షర్మిల ఓ లేఖ ద్వారా వైఎస్ అభిమానులకు తెలిపారు. అందులో అత్యంత కీలకమైన విషయాలు ఉన్నాయి. కుటుంబ వ్యాపారాలకు జగన్ "గార్డియన్ " మాత్రమేనని .. అన్నీ వ్యాపారాలు నలుగురు మనవళ్లు, మనవరాళ్లకు సమానంగా పంచి పెట్టలనేది జగన్ మోహన్ రెడ్డి భాధ్యత అని వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్ణయం అన్నరు. వైఎస్ఆర్ ఉద్దేశ్యాన్ని ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, సన్నిహితులందరికి,స్పష్టంగా తెలియచేశారని.. కేవీపీ రామచందరరావు , వైవి సుబ్బారెడ్డి , విజయసాయి రెడ్డి కి కూడా తెలుసని షర్మిల స్పష్టం చేశారు. నాన్న బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో, సరస్వతి అయినా...భారతి సిమెంట్స్ అయినా... సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా... నలుగురి బిడ్డలకు సమాన వాటా ఉండాలి అన్నది వైఎస్ఆర్ మాండేట్. ( ఒక్క సందూరు మినహాయించి ). రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉన్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్ఆర్ హఠాత్తుగా మరణించారు. ఆ తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈ రోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదని షర్మిల లేఖలో తెలిపారు. వైఎస్ జగన్ గురించి ఆయన సోదరి షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు జగన్ అంటే ప్రాణం అని స్పష్టం చేశారు. సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆస్తి పంపకాల ఇష్యూపై వైఎస్ షర్మిల స్పందించారు. ఈ సమస్యపై సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. ఆయన ఎవరు? అని నిలదీశారు. సుబ్బారెడ్డి జగన్ మోచేతి నీళ్ల తాగేవాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ పదవులు ఇస్తే అనుభవిస్తున్నారన్న షర్మిల.. ఇలా కాకపోతే ఎలా మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు సాయి రెడ్డి కూడా మాట్లాడుతారు.. సాయి రెడ్డి కూడా ఆయన చేతిలోనే ఉన్నాడు కదా వ్యాఖ్యానించారు.వాళ్ల దగ్గర ఇంకా నిజాయితీ ఏమైనా ఉందా చూద్దాం అనుకున్నాను. వీళ్లందరికీ వైఎస్ఆర్ తెలుసు. ఆయన మనోభావాలు కూడా తెలుసు. అమ్మకు అర్థం కావాలి. నా వరకు నేను చెప్తున్నది నిజమని నేను ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి కూడా ప్రమాణం చేయాలి. వైఎస్ఆర్ బిడ్డ తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తుంది. వైఎస్ఆర్ ఉన్నప్పుడు భారతి సిమెంట్స్‌లో నలుగురు చిన్న బిడ్డలకు సమాన వాటా ఉండాలన్నారు. ఇది ప్రమాణంగా చెప్తున్న' అని షర్మిల స్పష్టం చేశారు.ఇచ్చిన మాట ఏమయ్యింది అని జగన్ అన్నను అడిగా. జగన్ నాన్నకు మాట ఇచ్చారు. ఈ లోకంలో నీ తరువాత పాప మేలుకోరేది నేనే అని జగన్ చెప్పాడు. డోంట్ వర్రీ డాడ్ అన్నాడు. ఇది నిజం అని నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తా. వైవీ సుబ్బారెడ్డి తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్పాలి. లేదా జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేసి చెప్పాలి. సుబ్బారెడ్డి అంటున్నాడు.. సాక్షికి, భారతి సిమెంట్స్‌కి వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. అందుకే ఆ ఆస్తులు వాళ్లవే నట. అందులో నాకు హక్కు లేదట. జగన్ సొంతగా సంపాదించాడట' అని షర్మిల వ్యాఖ్యానించారు.'ఆరోజు వాళ్ల పేర్లు పెట్టుకుంటే నేను అభ్యంతరం చెప్పలేదు. పేర్లతో ఏముంది అనుకున్నాను. అన్న ముచ్చట పడ్డాడు అనుకున్నాను. వాళ్ల పేర్లతో ఆస్తులు ఉంటే.. నిజంగా వాళ్లవి అవుతాయా? నా పేరు మీద ఆస్తులు రాసి ఉంటే నేను ఎందుకు జైలుకి వెళ్లలేదు అంటున్నారు. ఏ అన్న అయినా.. చెల్లెలు గిఫ్ట్ అంటే.. ఏ బంగారమో... చీరనో... గిఫ్ట్ ఇస్తారు. అంతేకాని ఆస్తుల్లో 40 శాతం వాటా ఇస్తారా? ఇవ్వాలని అనుకున్నది గిఫ్ట్ కాదు.. నా హక్కు. నా హక్కు కాబట్టే నాకు ఇస్తామని అన్నారు' అని షర్మిల వివరించారు'ఇవ్వాల్సిన భాధ్యత వాళ్లకు ఉంది కాబట్టి ఎంవోయూ రాశారు. ఎంవోయూ రాయమని నేను అడగలేదు. సరస్వతి సిమెంట్స్ ఈడీ అటాచ్‌లో లేదు. అందుకే సరస్వతి సిమెంట్స్ వెంటనే ట్రాన్స్ ఫర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేదు. జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు.. ప్రతి ఇంట్లో ఉండే కహాని అంట. ఇంత సునాయాసంగా ఎలా మాట్లాడుతున్నారు. మీకు సెంటిమెంట్ లేదా? ఎమోషన్ లేదా? ఈ మాటలు ఎవరో అంటే పట్టించుకొనే దాన్ని కాదు. నా సొంత చిన్నాన్నా అంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చిన్నాన్న.. నా బిడ్డలు నీ ముందు పెరగలేదా? నా బిడ్డలను మీరు తాకలేదా?' అని షర్మిల ప్రశ్నించారు.'దేవుడు అంతా చూస్తున్నాడు. అంతా గమనిస్తున్నాడు. వైసీపీ క్యాడర్‌కి నేను ఒక మాట చెప్పాలని అనుకుంటున్న.. 2019లో వైసీపీ ప్రభుత్వం 151 స్థానాలు గెలిచి ఏర్పడింది. ఇది అప్పుడు అఖండ విజయం. ఎలా సాధ్యం అయింది. ఎంతో మంది వైఎస్ఆర్ అభిమానులు అనుకుంటే వచ్చింది. ఎంతో కష్టపడితే... త్యాగాలు చేస్తే ఆ విజయం సాధ్యం అయింది. నేనే కాదు...అమ్మే కాదు..ఎంతో మంది త్యాగాలు చేశారు. నేను అమ్మ ఇద్దరం మా శక్తి కి మించి పని చేశాం' అని షర్మిల భావోద్వేగానికి గురయ్యారు.'అమ్మకు మోకాళ్ల నొప్పులు ఉండేవి. బాధలు భరించి ఏడ్చుకుంటూ పార్టీ కోసం కష్టం చేసింది. నేను కూడా 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేశా. నన్ను పాదయాత్ర చేయమని అడిగితే చేశా. నన్ను ఆరోజుల్లో సూర్యుడు వరకు వెళ్లమని అన్నా కూడా వెళ్లే దాన్ని. ప్రాణాలను సైతం నేను లెక్క చేయలేదు. నాకు జగన్ అన్న అంటే ప్రాణం. వైసీపీని అడుగుతున్న.. నేను మీకు ఏం అన్యాయం చేశా.. ఒక్క కారణం



చెప్పండి. మీకు ఏం అవసరం వస్తే అవసరానికి మించి తిరిగా' అని షర్మిల వ్యాఖ్యానించారు.'సమైక్యాంధ్ర ఉద్యమం చేయమని అడిగితే చేశా. ఓదార్పు యాత్ర చేశా. బై బై బాబు అంటూ చేసిన క్యాంపెయిన్ దేశంలో పెద్దది. మీకు ఇన్ని చేస్తే... మీరు నాకు ఏం చేశారు? మీరు నాకు, నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు. ఇది అమ్మకు తెలుసు..అందరికీ తెలుసు. 5 ఏళ్లు మీరు రాసి ఇచ్చిన ఎంవోయూ నా చేతుల్లో ఉంది. నాకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. నాకు అవసరం వచ్చినా... నేను బయట పెట్టలేదు. ఎంవోయూ బయటకు పోతే వైఎస్ఆర్ గురించి నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతారు. నాన్న పేరు చెడగొట్టడం నాకు ఇష్టం లేదు' అని షర్మిల వివరించారు.'నాకు వేరే స్వార్థం ఉంటే నేను ఏదో ఒక మీడియా హౌజ్‌కి ఇచ్చేదాన్ని కదా. ఇవ్వాళ అందరి చేతుల్లో ఎంవోయూ ఉంది. దీనికి కారణం నువ్వు కాదా? సొంత కొడుకు తల్లిని కోర్టుకి ఈడ్చాడు. ఇది చూడటానికి నేను ఇంకా బ్రతికి ఉన్నానా అని విజయమ్మ ఏడుస్తుంది. బెయిల్ రద్దు చేసేందుకు.. నేను ఈ కుట్ర పన్నాను అంటున్నాడు. అందుకే కోర్టుకి తల్లిని ఈడ్చాడట. నీ లబ్ధి కోసం తల్లిని వాడుకుంటవా. వైఎస్ఆర్ చనిపోయాక... సీబీఐ ఛార్జ్ షీట్‌లో పేరు పెట్టించింది ఈ జగన్ కాదా? ఛార్జ్ షీట్‌లో పెట్టక పోతే.. బెయిల్ రాదని చేర్చిన మాట నిజం కాదా? నీ లబ్ధికి అమ్మా నాన్నలను వాడుకుంటారా?' అని షర్మిల నిలదీశారు.

# బిలినియర్ల రాజ్యంగా భారత్

ఆర్థిక అభివృద్ధిలో 10 సంవత్సరాల పాలనాకాలం అంటే పెట్టుబడులు పెట్టే కాలానికీ, ఫలాలు అందుకునే కాలానికీ మధ్యగల కాలం. పదేళ్లు అంటే చాలా ఎక్కువే. ఈ పథకాన్ని ప్రారంభించిన పాలకులు పదేళ్లుగా వారే అధికారంలో ఉండటం గమనార్హం. కానీ అభివృద్ధి మంత్రంగా స్వదేశీ ఉద్యమంగా చేపట్టిన మేకిన్ ఇండియా పథకం దేశంలో వివిధ రంగాల అభివృద్ధి స్థాయిని పెంచలేకపోయింది. ఈ పథకం పురోగమనానికి అనేక రంగాల అల్పాభివృద్ధి అవరోధాలే కారణమని అంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అల్పాభివృద్ధి, యువతకు సాంకేతిక రంగంలో పరిజ్ఞానం లేకపోవడం, విద్యుత్ రవాణా రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేకపోవడం ఒకవైపు మేకిన్ ఇండియా పురోగమనానికి అవరోధాలుగా ఉన్నాయి. దేశంలో కావలసిన అవస్థాపన వసతులు ఉంటే తప్ప పెట్టుబడిదారులకు ముందుగా పెట్టుబడులు పెట్టలేరు. మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది. పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది.ఆనాడు మహాత్మా గాంధీ బ్రిటిష్ పారిశ్రామికవేత్తల ఉత్పత్తులకు వ్యతిరేకంగా స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు చేపట్టిన స్వదేశీ ఉద్యమం నేడు మన ప్రధానమంత్రి చేపట్టిన మేక్ ఇన్ ఇండియా రెండూ ఒక్కటేనా? గాంధీజీ ప్రకారం పెట్టుబడి దారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు. పరిపాలనా విధానా లు, చట్టాల ద్వారా అందరికీ క్షేమం అందించేదే రాజ్యం. అటు రాచరిక వ్యవస్థకు ఇటు కమ్యూనిస్టు వ్యవస్థకు మధ్య మార్గమే ఇప్పటి ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ. ఇది ఆయా దేశాల జాతీయ వాదానికి సంబంధించిన వాదన. దేశ జాతీయవాదం ప్రజల కోసం ఉండాలి గాని పెట్టుబడిదారుల లాభాల కోసం కాకూడదని గాంధీజీ అభిప్రాయ పడ్డారు. మనదేశంలో 1920 శతాబ్దంలో ఏర్పడిన జాతీయవాదం దేశ స్వాతంత్రం కోసం అన్ని కులాలను మతాలను కలుపుకొని వలస పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించింది. మాకు బ్రిటిష్ ప్రజలతో ఎటువంటి వ్యతిరేకత లేదు. బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే వారి పెట్టుబడుల వలన మా దేశంలో ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగం పేదరికం ఏర్పడుతుందని మహాత్మా గాంధీ అన్నారుఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవంతో పెట్టుబడుల్లో, ఉత్పత్తిలో పెరుగుతున్నాయి గానీ ఆదాయ అసమానతలు తగ్గలేదు. 1890లో గాంధీ లండన్ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదివేటప్పుడు ఈ విషయాన్ని స్వయంగా గమనించి వివరించారు. వలస పాలకు లు మనదేశంలో వసూలు చేసిందల్లా సముద్రాల్ని దాటించి పారిశ్రామిక విప్లవం ఇంగ్లాండ్‌లో జరిగేటట్టుగా చూసుకున్నారు. మనదేశంలో ఆదాయాలు తగ్గి నిరుద్యోగం పెరిగింది. పెట్టుబడిదారీ విధానం చిన్న చిన్న ఉత్పత్తిదారులను నిర్వీర్యం చేసి నిరుద్యోగం పెరిగేటట్లు చేస్తుందని గాంధీజీ అభిప్రా యం. ఈ క్రమంలోనే 1920లో బ్రిటిష్ పెట్టుబడిదారులను వ్యతిరేకించిన భారతీయ పెట్టుబడిదారులు తర్వాత బ్రిటిష్ పెట్టుబడిదారులతోనే లాలూచీ పడ్డారు. అందుకే స్వదేశీ విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిదారుల చారిత్రక నేపథ్యం తెలుసుకోకుండా, వారి స్వలాభాపేక్షతో కూడిన జాతీయవాదాన్ని అర్థం చేసుకోకుండా మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమో..? ప్రస్తుత పాలకులు ఆలోచించాలి. తాము ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ప్రజల కోసమా? పెట్టుబడిదారుల కోసమా? అనే ప్రశ్న వేసుకోవాలి. రోజురోజుకు ప్రస్తుత పాలకులు గాంధీజీ ఆర్థిక విధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి.2014 సెప్టెంబర్ 25న ప్రారంభించిన మేకిన్ ఇండియా పథకం ద్వారా ఉత్పత్తి రంగంలో పెట్టుబడులను పెంచి తద్వారా దేశంలో పరిశ్రమల సామర్థ్యాన్ని పెంచాలని మౌలిక వసతులను కల్పించాలని ఉద్యోగతను పెంచాలని, అందుకోసం 25 ప్రధాన రంగాలను ఎంపిక చేసి వాటిలో పెద్ద సంఖ్యలో పెట్టుబడులను పెట్టేందుకు స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులను ఆహ్వానించి దేశంలో పారిశ్రామికీకరణ స్వదేశీయతతో కూడుకున్నదిగా అభివృద్ధి చేయాలని మన ప్రధానమంత్రి బాధ్యతలను చేపట్టిన తొలి రోజుల్లోనే కోరుకున్నారు. పది వసంతాలు పూర్తయినాయి. 2014 నుంచి 2023 వరకు ఎఫ్‌డీఐలలో 900 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఆటో మొబైల్ రంగంలో పురోగతి ఫార్మాసూటికల్ రంగంలో గ్లోబల్ హబ్‌గా మారడం ఎలక్ట్రానిక్ పరిశ్రమ పురోగతి రక్షణ రంగంలో కూడా స్వావలంబన దిశగా అడుగులు వేయడం జరిగింది. అయినప్పటికీ దేశంలో పారిశ్రామికీకరణకు అవసరమైన మౌలిక వసతులు విద్యుత్, నీటి సౌకర్యాలు లేవని పెట్టుబడుల ప్రవాహం అక్కడికక్కడ అంతంత మాత్రంగానే సాగింది. దేశంలో పారిశ్రామిక రంగం తిరోగమనంలో పడింది అంటే డి ఇండస్ట్రియలైజేషన్ జరుగుతుందని చెప్పాలి. ఆనాడు గాంధీజీ స్వదేశీ ఉద్యమాన్ని చేపట్టి దేశంలో స్వదేశీ పరమైన పారిశ్రామికీకరణ జరగాలని విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని, స్వదేశంలో ఉపాధిని పెంపొందించాలని కోరుకోవడం మన పాలకులు మరిచినట్టు ఉన్నారు. కానీ పెట్టుబడిదారుల కనుసన్నల్లో ఉన్న మేకిన్ ఇండియా పథకం ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదు. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులపై ఆధారపడిన మేకిన్ ఇండియా పథకం తిరోగమనంలోకి పోయింది. ఫలితంగా పారిశ్రామిక ఉత్పత్తుల వాటా మన స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల లేకుండా పోయింది. దేశంలో పరిశ్రమలు నిర్వీర్యమై పారిశ్రామిక రంగం పతనమైంది.మేక్ ఇన్ ఇండియా పథకం ఉద్యోగతను కల్పించే బదులుగా నిరుద్యోగితను పెంపొందించింది.

పారిశ్రామికీకరణకు బదులుగా పారిశ్రామిక పతనానికి దారితీసింది. విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులను నమ్ముకుని కార్పొరేట్ రంగానికి బలోపేతం చేసి చిన్న తరహా మధ్య తరహా పరిశ్రమలను నిర్వీర్యం చేయడం వలన ఉద్యోగిత, డిమాండ్, పెట్టుబడులలో ఆర్థిక వ్యవస్థలో తగ్గిపోయి ప్రజల కొనుగోలు శక్తి నిర్వీర్యమైంది. ఫలితంగా 2024లో ఆకలి సూచికలో 127 దేశాలలో మన దేశం 105వదిగా మిగిలింది. కొనుగోలు శక్తి లేక ప్రజలు దేశంలో ఉన్నారని తెలుస్తుంది. 2022లో ప్రచురించిన వరల్డ్ ఇన్ క్వాలిటీ రిపోర్ట్ ప్రకారం మన దేశంలో సంపన్నులు ఒక శాతం దగ్గర 40 శాతం పైగా సంపద ఉన్నది. బిలినియర్ల రాజ్యంగా భారత్ మారుతున్నదని ఈ నివేదిక తెలియజేస్తున్నది. మేక్ ఇన్ ఇండియా స్వదేశీ ఉత్పత్తుల ఉద్యమంగా ప్రారంభించి 10 సంవత్సరాలైనా ఉద్యోగిత కానీ ఆదాయాలు కానీ పెరగక దేశ ప్రజలకు నిరాశ మిగిలింది.

# హైదరాబాదీని మెచ్చుకున్న ఆనంద్ మహేంద్ర

**హైదరాబాద :** కార్పొరేట్ ప్రపంచానికి ఆనంద్ మహీంద్రాను కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే వారికి ఆనంద్ మహీంద్రా గురించి కొత్తగా చెప్పడానికి ఏమీ లేదు. తన సంస్థ ఉత్పత్తుల గురించి ప్రత్యేకంగా చెప్పే ఆనంద్.. తనకు నచ్చిన విషయాలను కూడా అదే స్థాయిలో ప్రస్తావిస్తారు..సోషల్ మీడియాలో తెగ యాక్టివ్ గా ఉండే ఆనంద్ మహీంద్రా.. ప్రపంచం నలుమూలలో జరిగే విషయాలను, సరికొత్త ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకొస్తారు. ఆ వీడియోలను, లేదా దానికి సంబంధించిన వ్యక్తులను సోషల్ మీడియా ప్రపంచానికి పరిచయం చేస్తారు. ఈ సందర్భంగా తనదైన వ్యాఖ్యానాన్ని దానికి జత చేస్తారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఆనంద్ మహీంద్రా తన ట్విట్టర్ ద్వారా సరి కొత్త విషయాన్ని నెటిజన్ల తో పంచుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా విచిత్రమైన కార్లను తయారు చేస్తున్నాడు. వాటితో ఏకంగా మ్యూజియం ఏర్పాటు చేశాడు. రాసే పెన్ను, గీసే పెన్సిల్, వేసుకునే షూ, తుడిపే రబ్బర్, షార్ప్ నర్ ఆకారాలలో కార్లను రూపొందించాడు. అంతే కాదు గిన్నిస్ రికార్డుల్లోనూ తన పేరును లిఖించుకున్నాడు.సుధాకర్ చేసిన సూక్ష్మ "కారు" రూపాలు ఆనంద్ మహీంద్రా కు తెగ నచ్చాయి. ఆ మ్యూజియం కూడా అతడిని ఆకట్టుకుంది. దీంతో ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ఆనంద్ పంచుకున్నారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా దర్శనమిస్తోంది. వెరైటీగా ఉన్న కార్లను చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు.. ఈ వీడియోను షేర్ చేస్తూ ఆనంద్ తనదైన శైలిలో ఓ కామెంట్ జత చేశారు. " ఈ ప్రపంచం వినూత్నంగా ఉండాలి.. అది మరింత నవ్యతను రూపొందించుకోవాలి.. అలా జరగాలంటే.. మన అభిరుచిని వ్యక్తం చేయాలి. అలాంటి వ్యక్తులు కచ్చితంగా ఉండాలి. ఈ వీడియోలో కనిపిస్తున్న వాహనం చాలా విచిత్రంగా ఉంది. ఇలాంటి వాహనాల పైన ఎవరికీ ఎలాంటి అభిరుచులు ఉన్నా వాటిని మేము సమర్థిస్తాం. నేను ఈసారి హైదరాబాద్ ఎప్పుడైనా వస్తే.. కచ్చితంగా ఇక్కడికి వెళ్లడానికి నా ప్రణాళిక రూపొందించుకుంటాను. ఇది ఆసక్తికరంగానే కాదు.. విచిత్రంగానే కాదు.. సమ్మోహనానికి గురి చేసే ప్రయత్నం ఇది. ఎంతో అభిరుచి ఉంటే తప్ప ఇలాంటి పనులు చేయలేం. మన చుట్టూ ఇలాంటి వ్యక్తులు చాలా మంది ఉంటారు..కానీ వారు వెలుగులోకి రావడం అత్యంత అరదు. అందుకే అలాంటివారి ప్రతిభను మిగతా ప్రపంచానికి చూపించాలనదే నా తాపత్రయం.. ఇలాంటి ఆవిష్కరణలు మరిన్ని రావాలి. అప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుంది. " ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. కాగా, ఈ వీడియో ఇప్పటికే లక్షల్లో వీక్షణలను సొంతం చేసుకుంది. " వీడియో చాలా బాగుంది. కార్ల నమూనాలు ఇంకా బాగున్నాయి. మీరు వీడియో షేర్ చేసినందుకు ధన్యవాదాలు ఆనంద్ జీ" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.



# తమిళనాడులో విజయ్ ... సిద్ధం సభలు



**చెన్నై :** పెన్సిల్ రంగ్ ప్యాంట్.. వైట్ షర్ట్.. మీడియం స్థాయి కంటే తక్కువ గడ్డం. అదే స్థాయిలో జుట్టు. మొత్తంగా చూస్తే మాస్ క్లాస్ కలబోతతో ఆహార్యం.. ఇదీ ఆదివారం నాటి విల్లుపురం సమీపంలో తమిళగ వెట్రి కళగం పార్టీ మహానాడు సభలో.. దాని వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు విజయ్ కనిపించిన తీరు.అక్కడి వాతావరణం.. సభ నిర్వహించిన తీరు మొత్తంగా జగన్మోహన్ రెడ్డి సిద్ధం సభలను గుర్తు చేశాయి. జగన్మోహన్ రెడ్డి మాదిరిగానే విజయ్ కూడా అలాంటి డ్రెస్సే ధరించారు. వేదికలు కూడా అలానే నిర్మించారు. ఇటీవలి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి సిద్ధం పేరుతో సభలు నిర్వహించారు. ఆ సభలకు వైసీపీ శ్రేణులు భారీగా జన సమీకరణ చేశాయి. ఆ వేదిక విభిన్నంగా ఉండేది. సహజంగా రాజకీయ పార్టీల సభలు అంటే వేదికలు భారీగా ఉంటాయి. వేదిక మీద కూర్చున్న వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. కానీ సిద్ధం సభలు ఇందుకు పూర్తి భిన్నం. ఎందుకంటే పొడవైన ర్యాంపు నిర్మించేవారు. దానిపైన జగన్మోహన్ రెడ్డి నడుచుకుంటూ ప్రసంగించేవారు. మిగతా నాయకులు ఆయనకు వెనకాల కూర్చునేవారు. వారి సమయం వచ్చినప్పుడు అక్కడ నుంచి ప్రసంగించేవారు. సేమ్ సిద్ధం సభల్లాగానే విజయ్ కూడా తన మహానాడు సభను నిర్వహించారు.ఆదివారం నాటి తమిళగ వెట్రి కళగం నిర్వహించిన మహానాడు విజయవంతమైంది. విజయ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. మొత్తంగా రెండు లక్షల మంది దాకా ఈ సభకు వచ్చారని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. విజయ్ కనిపించిన తీరు అచ్చం సిద్ధం సభల్లో జగన్మోహన్ రెడ్డిని పోలి ఉంది. దీంతో వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో విజయ్, జగన్మోహన్ రెడ్డిని పోల్చి ప్రచారం చేస్తున్నారు. " 2019లో ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు జగన్మోహన్ రెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతి విషయం లోనూ ఏపీ ప్రయోజనాలను గుర్తుచేస్తూ ప్రసంగించారు. నాడు అధికారంలో ఉన్న టిడిపి తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు.. ముఖ్యంగా ఆంధ్ర అనే సెంటిమెంట్ ను ప్రజల్లో రగిలించారు. అన్నింటికీ మించి ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ప్రజలను కోరారు. ఆయన మాట తీరుకు.. ప్రసంగించిన తీరుకు ప్రజలు ఆశీర్వదించారు.. నాటి ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తం సుడిగాలి పర్యటన చేశారు. ఆయన దూకుడు అప్పటి అధికార పార్టీ టిడిపిని మట్టికరిపించింది..151 అసెంబ్లీ సీట్లు వైసిపి గెలుచుకుంది. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే మునుపెన్నడూ లేని సంచలనం సృష్టించింది. ఇప్పుడు విజయ్ కూడా జగన్మోహన్ రెడ్డి లాగానే కనిపిస్తున్నారు. అలానే మాట్లాడుతున్నారు. తమిళనాడు రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ కూడా జగన్మోహన్ రెడ్డి మాదిరిగానే సునామి సృష్టించబోతున్నారని" వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.

## ఆప్‌ను బుక్ చేయబోయి..

# తాను అనారోగ్యం పాలై...

**న్యూఢిల్లీ :** నేను రోజు ఉదయం మార్నింగ్ వాకింగ్ వెళ్తాను. నాకు ఎంతటి అనారోగ్యం ఉన్నా దానిని మానుకోలేను. అయితే కొద్దిరోజులుగా నేను అలా చేయలేకపోతున్నాను. దానికి కారణం వాతావరణం బాగోలేకపోవడమే. డాక్టర్లు కూడా నన్ను అలా చేయవద్దు అన్నారు" ఈ మాటలు అన్నది చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా డివైస్ చంద్ర చూడ్.. ఢిల్లీలో కాలుష్యం ఏ స్థాయిలో పెరిగిందో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చేసిన వ్యాఖ్యలను బట్టి అర్థం చేసుకోవచ్చు. సాధారణంగానే ఢిల్లీలో వాహనాల ద్వారా వెలువడే కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. అలాంటిది శీతాకాలంలోనైతే చెప్పతీరుగా ఉండదు.

ఢిల్లీకి పొరుగున హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు ఉంటాయి. ఈ రాష్ట్రాలలో శీతాకాలం సమయంలో రైతులు వరి వ్యర్థాలను, గోధుమ పంట వ్యర్థాలను తగలబెడుతుంటారు. ఫలితంగా ఆ పొగ ఢిల్లీ నగరాన్ని చుట్టుముడుతుంటుంది. ఆ సమయంలో ఢిల్లీ మొత్తం కాలుష్య కాసారంగా మారిపోతూ ఉంటుంది. గతంలో దీనిని నివారించడానికి ఆప్ ప్రభుత్వం సరి ? బేసి విధానాన్ని ప్రవేశపెట్టింది. అయితే అది కూడా సత్ఫలితాన్ని ఇవ్వకపోవడంతో.. ఇటీవల కృత్రిమ వర్షం విధానాన్ని తెరపైకి తెచ్చింది. అయితే ఇంకా అది అమల్లోకి నోచుకోలేదు. ఇక హర్యానా, పంజాబ్ రైతులు పంట వ్యర్థాలను తగలబెడుతుండడంతో ఢిల్లీ మొత్తం పొగ చూరింది. ఆస్తమా రోగులు, శ్వాస కోశ సంబంధిత వ్యాధులు ఉన్నవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.ఢిల్లీలో అధికారాన్ని చేపట్టిన తర్వాత ఆప్.. గంగానది ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అయితే అందులో అవకతవకలు జరిగాయని బిజెపి ఆరోపిస్తోంది. మరికొద్ది రోజుల్లో ఢిల్లీలో ఎన్నికలు జరగనున్నాయి. తినే పద్యంలో ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు వీరేంద్ర సెచ్ దేవ్.. యమునా నది ప్రక్షాళనలో ఆప్ నేతలు పాల్పడిన అక్రమాలను ప్రజలకు వివరించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆప్ ప్రభుత్వ తీరుకు నిరసనగా రెండు రోజుల క్రితం ఐటీవో ఘాట్ వద్ద యమునా నదిలో స్నానం చేశారు. దీంతో ఆయనకు ఊపిరి తీసుకోవడంలో సమస్యలు ఎదురయ్యాయి. చర్మ సంబంధిత అలర్జీలు సోకాయి. దీంతో ఆయన స్థానిక ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన ఆప్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.." యమునా నది ప్రక్షాళన పేరుతో ఆప్ ప్రభుత్వం దోపిడికి పాల్పడింది. నదిని కాలుష్యం నుంచి ప్రక్షాళన చేయకపోగా.. అడ్డగోలుగా దోచుకుంది. ఫలితంగా ఆ నది ఇంకా కాలుష్య కాసారం లాగానే కనిపిస్తోంది. దానికి నిదర్శనమే నా అనారోగ్యం. రెండు రోజుల్లో నేను స్నానం చేస్తేనే ఇలా అయిందంటే.. ఆ నది చుట్టుపక్కల ఉన్న వారి పరిస్థితి ఏమిటని" ఆయన ప్రశ్నించారు. కాగా, వీరేంద్ర సచ్ దేవ్ ఎన్నికల స్టంట్ లు చేస్తున్నారని.. యమునా నదిని దశలవారీగా తమ ప్రక్షాళన చేస్తున్నామని ఆప్ నేతలు చెబుతున్నారు.

# ఈవి రంగానికి అనంతపురం వ్యూహాత్మక ప్రదేశం

**ఆస్టిన్ (యుఎస్ఎ):** ఆస్టిన్ లోని టెస్లా కేంద్ర కార్యాలయాన్ని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. అంతర్జాతీయంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ రంగంలో జగజ్జేతగా ఉన్న టెస్లా ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టడానికి గల అవకాశాలపై టెస్లా సిఎఫ్ఓ వైభవ్ తనేజాతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎఫ్ఓ వైభవ్ తనేజా మాట్లాడుతూ... ఎలక్ట్రిక్ వాహనాలు, క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, బ్యాటరీ స్టోరేజిలో తమ సంస్థ గ్లోబల్ లీడర్ గా ఉందని తెలిపారు. ఇంటి నుండి గ్రిడ్ వరకు బ్యాటరీ పవర్ స్టోరేజి పరికరాలు, సోలార్ ప్యానల్స్, సోలార్ షింగిల్స్, డ్రైవింగ్ ఇన్నొవేషన్, మోడల్ –3, పవర్ వాల్ వంటి ఉత్పత్తుల ద్వారా ఇంధనరంగంలో స్థిరమైన వృద్ధి సాధిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది 18.8శాతం వృద్ధి సాధించి 832 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ తో 97బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... విజనరీ లీడర్ చంద్రబాబు గారి నేతృత్వాన 2029 నాటికి ఎపిలో 72 గిగావాట్ల రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మా లక్ష్యసాధనకు టెస్లా వంటి అగ్రశ్రేణి గ్లోబల్ కంపెనీల సహాయ,సహకారాలు అవసరమని అన్నారు.

గతంలో చంద్రబాబు సిఎంగా ఉన్నపుడు ఆటోమొబైల్ పరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు, కియా, హీరో మోటార్స్ వంటి కంపెనీలను రాష్ట్రానికి రప్పించారు. ఇప్పుడు ఎలక్ట్రికల్ వెహికల్స్ తయారీ, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ రంగాలపై ఆయన దృష్టిసారించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా టెస్లా ఇవి తయారీ, బ్యాటరీ ఉత్పత్తుల యూనిట్ల ఏర్పాటుకు వ్యూహాత్మక ప్రదేశంగా ఉంటుంది. ప్రగతిశీల నాయకత్వంలో పరిశ్రమలకు అనుకూలమైన సులభతరమైన విధానాలు ఎపిలో అమలు చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా సౌరశక్తి నిల్వ వ్యవస్థలు, ముఖ్యంగా స్మార్ట్ సిటీలు, గ్రామీణ విద్యుదీకరణకు సౌర ఫలకాలను అమర్చడంలో భాగస్వామ్యం వహించండి. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ ఆశయాలకు అనుగుణంగా రెన్యువబుల్ ఎనర్జీపై దృష్టిసారిస్తే సహకారం అందిస్తాం. ఆంధ్రప్రదేశ్ రాబోయే డేటా సెంటర్, ఐటి హబ్‌లకు వినూత్న బ్యాటరీ పవర్ స్టోరేజి పరిష్కారాలు అవసరం, టెస్లా ఎపికి వస్తే ఈ రంగంలో కీలకపాత్ర వహించే అవకాశం ఉంటుంది. రాష్ట్రవ్యాప్త ఇవి ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడం, సూపర్‌చార్జింగ్ టెక్నాలజీ అమలులో భాగస్వామ్యం వహించండి. ఆర్ అండ్ డి, ఇన్నోవేషన్‌లో కీలక పాత్ర పోషిస్తూ, స్థిరమైన ఇంధన పరిష్కారాలపై దృష్టి సారించిన టెస్లా... ఆంధ్రప్రదేశ్‌లో టెక్నాలజీ పార్కులను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. మంత్రి వెంట ప్రతినిధి బృందం సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ ఉన్నారు.



# అలాంటి వార్తలపై నయన మండిపాటు

## అలాంటి ప్రయత్నం చేయలేదు : నయనతార

హీరోయిన్లు తాము చేసే సినిమాల గురించే కాకుండా ఇతర విషయాలపైనా వార్తల్లో నిలుస్తుంటారు. అందులో వారి ప్రమేయం ఉండొచ్చు ఉండకపోవచ్చు. ఒక్కోసారి ఏ సంబంధం లేకుండానే వార్తలకెక్కుతారు. తాజాగా అలాంటి వార్తలపై నయనతార మండిపడ్డారు. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. దేవుడు ఇచ్చిన తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని, ఆ ఆలోచన కూడా రాలేదని తెగేసి చెప్పారు. నయన్ ఇండస్ట్రీ లో అడుగుపెట్టిన కొన్నాళ్ల తర్వాత పలు చిత్రాల్లో ఆమె ముఖం తొలి సినిమాలో కంటే సన్నగా కనిపించింది. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆదివారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె దీనిపై మాట్లాడారు. "నా కనుబొమ్మలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని కేటాయిస్తాను. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. ఇంకోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది.

కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార అన్నారు. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ బిజీ అయ్యారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన నయన్ ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.

# దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన పవన్

కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై నటుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రియాక్టయ్యారు. ఆయనతో పాటు విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ కూడా తనదైన స్టైల్‌లో రెస్పాండ్ అయ్యారు. బీజేపీ, డీఎంకే సిద్ధాంతాలకు వ్యతిరేఖంగా ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేతకు పవన్, ప్రకాష్ ఎం చెప్పారంటే.. "నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అంటూ విజయ్ ఆదివారం తన పార్టీ తొలి మహానాడులో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే దేశ నలుమూలల నుండి సినీ, రాజకీయ ప్రముఖులు విజయ్‌కి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా అభినందనలు తెలిపారు. పవన్ తన పోస్ట్‌లో " సిద్దులు, సాధువులకు నిలయమైన తమిళనాడులో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన విజయ్ కి నా హృదయపూర్వక అభినందనలు" అంటూ పోస్ట్ చేశారు.





### రెండు పార్టులుగా ఎస్ఎస్ఎంబీ29

**– బడ్జెట్ తెలిస్తే షాక్**



తెలుగు సినిమా స్థాయిని మరోసారి ప్రపంచానికి చాటి చెప్పిన స్టార్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు ఎస్ఎస్ రాజమౌళి. ఈ పాన్ ఇండియా దర్శకుడి కాంపౌండ్ నుంచి వచ్చిన బాహుబలి ఫ్రాంఛైజీ, ఆర్ఆర్ఆర్ ఏ రేంజ్‌లో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాయో తెలిసిందే. ఈ రెండు సినిమాలను ఓవర్‌టేక్ చేస్తూ.. తన రికార్డును తానే అధిగమించే భారీ స్కెచ్ వేసుకొని మహేశ్ బాబు హీరోగా ఎస్ఎస్ఎంబీ 29తో ముందుకొస్తున్నాడు జక్కన్న. వచ్చే ఏడాది ప్రారంభంలో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర అప్‌డేట్ ఇప్పుడు మూవీ లవర్స్‌లో జోష్ నింపుతోంది. గ్లోబల్ అడ్వెంచరస్ సినిమాగా రాబోతున్న ఈ చిత్రం రూ.1000 కోట్ల బడ్జెట్‌తో రాబోతుంది. రెండు పార్టులుగా తెరకెక్కనుంది. భారత అత్యంత ఖరీదైన సినిమాగా నిలువబోతుంది. జక్కన్న మహేశ్ బాబుతో ఎలాంటి సినిమాను ప్లాన్ చేస్తున్నాడో చెప్పేందుకు ఈ ఒక్క అప్‌డేట్ చాలు. ఈ సినిమా కోసం మహేశ్‌బాబు ఇప్పటికే మేకోవర్ మార్చుకుని.. లాంగ్ హెయిర్, గడ్డం, పోనీ టెయిల్ లుక్‌లో కనిపిస్తుండగా.. ఈ ఫొటోలు సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రానున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్.

# సాయి పల్లవి అంటే.. సాయి పల్లవే

## – ఆమె నటనకు ఫిదా...

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి, శివకార్తికేయన్ జంటగా విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్న సినిమా అమరన్. ఈ సినిమా దీపావళి కానుకగా పలు భాషల్లో అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో జోరు పెంచింది. కానీ.. సాయి పల్లవి ప్రమోషన్స్ అటెండ్ కాకుండా చేసిన పని చూస్తే మీరు గ్రేట్ అనాల్సిందే.. ఇంతకీ సాయి పల్లవి ప్రమోషన్స్‌కి ఎందుకు అటెండ్ కావడం లేదు.. ఇంతకీ సాయి పల్లవి ఎం చేశారంటే.. అమరన్.. ఈ సినిమాని కాశ్మీర్ నేపథ్యంలో శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత సంఘటనలతో రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాయి పల్లవి తన సోషల్ మీడియా ఖాతాలో ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశారు. "అమరన్ కోసం ప్రమోషన్‌లను ప్రారంభించే ముందు నేను నేషనల్ వార్ మెమోరియల్‌ని సందర్శించాలనుకున్నాను. ఈ పవిత్రమైన ఆలయంలో, మన కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి బ్రేవ్‌హార్ట్ జ్ఞాపకార్థం వేలకొద్దీ 'ఇటుక లాంటి పలకలు' ఉన్నాయి. మేజర్ ముకుంద్ వరదరాజన్, సిపాయి విక్రమ్ సింగ్ లకు నివాళ్లు తెలుపుతున్నపుడు నా ఒళు ళ్ళ పులకరించి పోయింది" అంటూ పోస్ట్ చేశారు. దీంతో అందరు సాయి పల్లవి గెస్చర్ కి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# సాయి పల్లవికి నేను పెద్ద అభిమానిని

## – దిగ్గజ దర్శకుడు మణిరత్నం



తమిళ దిగ్గజ దర్శకుడు మణిరత్నం నటి సాయి పల్లవిని ప్రశంసలతో ముంచెత్తాడు. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడించాడు. కోలీవుడ్ హీరో శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం అమరన్. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా ఈ సినిమా రానుండగా.. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ ప్రీ రిలీజ్ వేడుకను గ్రాండ్‌గా జరుపగా ఈ వేడుకకు ముఖ్య అతిథిగా దర్శకుడు మణిరత్నం వచ్చి మాట్లాడాడు. ఈ క్రమంలోనే సాయి పల్లవి గురించి మాట్లాడుతూ.. సాయి పల్లవికి నేను నేను పెద్ద అభిమానిని. తను అంటే చాలా ఇష్టమని. సమయం దొరికినప్పుడు కచ్చితంగా ఆమెతో సినిమా చేస్తానని మణిరత్నం వెల్లడించాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## మంథని పట్టణం లోని
## రోహిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు.





**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎన్టిపిసి వారి ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్ వారు ప్రభుత్వ మరియు ప్రవేట్ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఉచిత డెంటల్ – రక్త పరీక్షల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. విద్యార్థులకు డెంటల్ స్క్రీనింగ్ కిట్టును అందజేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూఆరోగ్య పరమైన మంథని మన లక్ష్యంతో అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.పిల్లల దంతాల సమస్యలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీర్ఘ కాలిక వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు . ప్రతి విద్యార్థి చదువుకొని ఉన్నత స్థాయిలో అభివృద్ధి సాధించాలని, చదువు లేకపోతే జరిగిన అరాచకాలు ఎన్నో చూశాం అని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకొని ఎదగాలని, మరొక పదిమందిని తయారు చేయాలని సూచించారు. మంథని ప్రాంతాన్ని సరస్వతీ కేంద్రంగాతీర్చిదిద్దుతున్నారు.ఆరోగ్యకరమైన తెలంగాణా కావాలని,అందులో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కోరారు.రామగిరి ఖిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఐదు కోట్ల నిధులు మంజూరు మంథనిలోని పురాతన దేవస్థానమైన గౌతమేశ్వర ఆలయానికి రెండు కోట్ల నిధులు మంజూరు మంథని ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం అన్నారు కార్యక్రమంలో.రోహిణి ఫౌండేషన్ సంబంధించిన పెద్దలు వైద్యులు.. అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో
## ఇసుక లారీ ఢీకొని మహిళ మృతి.



**మంథని (ప్రశ్న న్యూస్)** పెద్దపెల్లి జిల్లా మంథని పరిధిలోని అడవి సోమన్న పెల్లికి చెందిన ఇసుక లారీ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు మధ్యాహ్నం చోటు చేసుకుంది, తెలిసిన వివరాల ప్రకారం మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామానికి చెందిన సెగ్గెం శైలజ తన భర్త పిల్లలతో మంథని కి వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామమైన అడవి సోమనపల్లికి వెళు ్ండగా ఎర్రగండి సమీపంలో అడవి సోమనపల్లి నుండి హైదరాబాదుకు ఇసుకను తరలిస్తున్న లారీ వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది,దీంతో సెగ్గెం శైలజ అనే మహిళ సంఘటన స్థలం లోనే మృతి చెందగా ఆమె భర్త పిల్లలకు తీవ్ర గాయాల య్యాయి. సంఘటన స్థలా నికి చేరుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంథని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జోస్యం నిజమైందా.?

### - పొంగులేటి పేలుతుందన్న బాంబు ఇదేనా?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముందే చెప్పినట్లుగా దీపావళికి ముందే బాంబు పేలిందా? పొంగులేటి చెప్పిన బాంబు ఫాం హౌస్ బాంబా? అన్న చర్చ తెలంగాణ రాజకీయ పార్టీల్లో జోరుగా సాగుతుంది. సియోల్ నగరంలో పర్యటనలో ఉన్న పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి నాలుగు రోజుల క్రితం దీపావళికి ముందే పొలిటికల్ బాంబ్ పేలుతుందని తెలిపారు. ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ పార్టీల్లో హాట్ టాపిక్ గా మారాయి. త్వరలోనే బీఆర్ఎస్ అగ్రనేతలు అరెస్టులు ఉంటాయంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. దీపావళి కంటే ముందే బాంబులు పేలవుతాయని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు ఉండబోతున్నాయని చెప్పారు.

### - రాజకీయ సెగలు

అయితే పొంగులేటి జోస్యం నిజమయిందంటూ కొందరు రాజకీయనేతలు వ్యాఖ్యానిస్తున్నారు. జన్వాడ ఫామ్ హౌస్ లో పార్టీ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది ఫాం హౌస్ లోనే ఈ రేవ్ పార్టీ జరగడంతో పాటు అందులో పాల్గొన్న ఒకరికి పరీక్షల్లో డ్రగ్స్ తీసుకుంటున్నట్లు పాజిటివ్ గా రిజల్ట్ వచ్చిందని పోలీసులు తెలపడం, మోకిల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కావడం వంటివి చూస్తుంటే కేటీఆర్ ను రాజకీయంగా కట్టడి చేయడానికేనా? అన్న అనుమానం తమకు కలుగుతుందని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. కేటీఆర్ పేరును బద్నాం చేయడానికి ఈ కేసును ఒక వాడుకోవాలని చూస్తున్నారన్నారు. కేవలం కేటీఆర్ బామ్మర్ది నిన్న కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేశారని, అయితే అందులో ఏడు విదేశీ మద్యం బాటిల్స్ ఉన్నాయని, ఒక మనిషి నాలుగు బాటిల్స్ కంటే ఎక్కువ ఉంచుకోవడానికి వీల్లేదని, దీనిపైనే కేసు నమోదయిందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కేవలం రాజకీయ కుట్రలో భాగంగానే ఇది జరుగుతుందని అన్నారు.

### - రెండింటికీ ముడిపెడుతూ..

కానీ పోలీసులు మాత్రం తమ పని తాము చేసుకు పోతున్నారు. జన్వాడ ఫామ్ హౌస్ లో పార్టీ జరిగిందని, దీనివల్ల తాము కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా కేటీఆర్ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదంటూ నిలదీస్తున్నారు. కేటీఆర్ చెప్పేవన్నీ నిజాలు కాదని, ప్రతి రోజూ ఏదో ఒక అబద్ధం చెబుతూ ప్రభుత్వంపై బురద జల్లే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాలని చూస్తున్నారన్నారు. చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద పొంగులేటి శ్రీనివాసులు రెడ్డి వారం రోజుల క్రితం చెప్పిన బాంబు ఇదేనా? అంటూ సోషల్ మీడియాలో చర్చ సాగుతుంది. రాజకీయ వర్గాల్లోనూ ఇది ముందుగా పొంగులేటికి ఎలా తెలిసిందబ్బా? ఇదేనా? మరేదైనా ఉందా? అన్న అనుమానం కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఫాం హౌస్ లో జరిగిన పార్టీకి, పొంగులేటి కామెంట్స్ కు ముడిపెడుతూ పోస్టులు పెడుతున్నారు.

## సిపిఎం జిల్లా 15వ మహాసభలను
# జయప్రదం చేయండి

### - నవంబర్ 2,3 తేదీలలో తూప్రాన్.
### - సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు.



**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ )** మెదక్ జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ 15వ మహాసభలు తూప్రాన్ పట్టణంలో నవంబర్ 2, 3 తేదీలలో లింగారెడ్డి గార్డెన్స్ లో నిర్వహిస్తున్నట్లు సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు తెలిపారు. సోమవారం విలేకర్లతో వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కమ్యూనిస్టుల అవసరం పెరిగిందని గుర్తుచేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా, కార్మికుల సమస్యలు పరిష్కరించాకుపోను అధికమైనవని మండిపడరు. రైతు, కార్మిక విధానాలు అవాలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు, భూస్వాములకు ఊడిగం చేస్తుందని మండిపడారు. ప్రజలకోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం ప్రభుత్వం ఎలా ఉంటుందో కేరళ రాష్ట్ర ప్రభుత్వాని చూడాలని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలం చెందిందని మండిపడారు. మహిళలకు గృహ జ్యోతి, రైతులకు రైతు బంధు, పింఛండ్లు పెంపు వంటి కీలకమైన హామీలను మర్చిపోయిందని గుర్తుచేసారు. హైదరాబాద్ లో హైడ్రా పేరుతో పెద్ద పెద్ద భవనాలు కూల్చడంలో పరదర్శకత ఉండాలని, అనుమతులు ఉన్న నిరుపేద కుటుంబాల ఇండ్లు కూల్చడం సిగ్గుచెటని హైడ్రా నిరుపేదల జోలికి వెళ్లకుండా తన లక్ష్యం దిశగా అడుగులు ఉండాలని గుర్తుచేసారు. నిరుపేదల ఇళ్లు ఎక్కడైతే కూల్చారో వారికీ వెంటనే పునరావాసం కోసం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, లేదంటే కాంగ్రెస్ ఇస్తానన్న ఇందిరామ్మా ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. మెదక్ జిల్లాకు గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్న, నేడు కాంగ్రెస్ అధికారంలో ఉన్న జిల్లాకు చేసిందేమి లేదన్నారు. ముక్యంగా జిల్లా కేంద్రంలో కనీసం లేబర్ కార్యాలయం లేదని, జిల్లాలో అనేక మంది నిరుద్యోగంతో బాధపడుతూ వలసలు వెళ్లిన ఎక్కడ ఒక పరిశ్రమలు నూతనంగా నిర్మించి, ఉపాధి అవకాశాలు కల్పించలేదాన్నారు. హైదరాబాద్ కు అతి సమీపంలో ఉన్న మెదక్ జిల్లాలో ఒక పీజీ కళాశాల ఏర్పడిన పాలకుల నిర్లక్ష్యం మూలంగా స్థలం లేదు సొంత భవనం కళాశాలకు లేదని ఉన్న కోర్సులు ఎత్తివేసి చివరకు పీజీ కళాశాల లేకుండపోయే దుస్థితి ఏర్పడిందని గుర్తుచేసారు.ఈ నేపథ్యంలో జిల్లాలో జరుగుతున్న సిపిఎం 15వ మహాసభలలో గత 3సంవత్సరాల పోరాటాలు నెమరువెసుకొని భవిషత్తు కార్యాచరణ రూపొందిస్తూ జిల్లాలో పార్టీ పెరుగుద్దల, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా సిపిఎం వెళ్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశం, సంతోష్ పాల్గొన్నారు.

## రితాడు మాయం చేస్తున్న నరేష్

### - అక్షరాస్యతతో మూఢనమ్మకాల నిర్మూలన,
### - ఎస్సై మహమ్మద్ గౌస్,
### - సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్,



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** కొల్చారం అక్షరాస్యతతో మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమని ఎస్సై మహమ్మద్ గౌస్ , సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కొల్చారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల మరియు కస్తూర్బా బాలికల విద్యాలయం నందు మహిళల రక్షణ- సైన్సు- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సై గౌస్ ,ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ తార సింగ్ , ప్రిన్సిపల్స్ పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలులో రైతుకు
## ఏ ఇబ్బంది లేకుండా సేకరణ చేపడతాం

### - అధికారులు సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి
### - మంథని ఏఎంసి, ఎక్లాస్ పూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం
### - రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మాత్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని ( ప్రశ్న న్యూస్)** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఏ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంథని ఏఎంసి, ఎక్లాస్ పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, సింగిల్విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన సన్న రకాలకు రూ.500బోనస్ ఇస్తామని అన్నారు. రైతులను రైస్ మిల్లర్లు ధాన్యంలో



కోత విధించి ఇబ్బందులకు గురిచేస్తే ఏ మాత్రం ఉపేక్షించేది లేదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 2లక్షల లోపు రుణాలు ఉన్న రైతులకు ఇప్పటి వరకు రూ.18వేల కోట్ల నిధులు విడుదల చేసి మాఫీ చేయడం జరిగిందని అన్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ నిలిచిపోయిన రైతులకు త్వరలోనే వాటిని సరిదిద్ది మాఫీ చేస్తామని అన్నారు. రైతులు కాలానుగుణంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించే విధంగా రైతులకు మేలు చేసేందుకు డ్రోన్ ఫార్మింగ్ పైలట్ ప్రాజెక్టును మంథని నియోజకవర్గం లో చేపట్టబోతున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సన్న, చిన్నకారు రైతులకు లాభం చేకూర్చే విధంగా తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోందని, ఇందుకోసం వ్యవసాయ అధికారులు రైతుల నుంచి సమాచారం సేకరిస్తున్నారని అన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఏ ఇబ్బంది లేకుండా ఆనాడు కాంగ్రెస్ హాయాంలో గోదాంల నిర్మాణం చేపట్టుకున్నామని, ఇప్పుడు గోదాంల కెపాసిటీ పెంచుకునేందుకు మరిన్ని గోదాంల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసే విధంగా నా వంతు సహకారం అందిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి గా నిలబెట్టుకున్నామని, ఇప్పటికే ఉచిత కరంటు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు, ఆరోగ్య శ్రీ రూ.10లక్షలకు పెంపు చేశామని అన్నారు. మరిన్ని పథకాలను కూడా త్వరలోనే అమలు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, తమ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో ఉందని అన్నారు. పేద పిల్లల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ప్రవేశపెడుతున్నామని అన్నారు. దీపావళి కానకగా ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని పండగ రోజున ప్రారంభించుకోబోతున్నామని అన్నారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ, మంత్రి శ్రీధర్ బాబు సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ రాష్ట్రంలోనే అధిక మొత్తంలో ధాన్యం సేకరిస్తామని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటిస్తూ రైతుల నుంచి సేకరణ చేపడతామని అన్నారు. ముందుగా మంత్రి శ్రీధర్ బాబుకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం బొకె ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని మంత్రి శ్రీధర్ బాబుకు ఎద్దులబండితో కూడిన మెమోంటోను కొత్త శ్రీనివాస్ అందజేశారు. ఈ వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో జిల్లా సహకార అధికారి శ్రీమాల, డిఎంఓ ప్రవీణ్ కుమార్, సివిల్ సప్లయి డిఎంశ్రీకాంత్ రెడ్డి, సంఘ ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి, డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిమూర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మీ-మొండయ్య, ఉడుత మాధవి-పర్వతాలు యాదవ్, దేవళ్ల విజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ పెండ్లి రమ-సురేష్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిటీ బోర్డు మెంబర్ శశిభూషణ్ కాచే, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి కొండశంకర్, నాయకులు పేరవేన లింగయ్య, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు, అజీంఖాన్, చెన్నవేన సదానందం, పెండ్లిప్రభాకర్ రెడ్డి, మంథని సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బాణయ్య, కౌన్సిలర్లు వికే రవి, నక్క నాగేంద్ర, చొప్పకట్ల హనుమంతరావు, కొట్టె పద్మ-రమేష్, ఏడిఏ అంజని, మార్కెట్ కమిటీ సెక్రటరి సతీష్, ఏఓ రామకృష్ణ, సంఘ సెక్రటరీ మామిడాల ఆశోక్ కుమార్,పెద్ద సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికలకు మెరుగైన వైద్యం అందిస్తాం

### - అస్వస్థతకు గురైన కే.జి.బీ.వి
### విద్యార్థులను పరామర్శించిన
### - ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు





**మంథని ( ప్రశ్న న్యూస్)** కేజీబీవీలో అస్వస్థతకు గురైన బాలికలు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తామని రాష్ట్ర మంత్రి, అన్నారు.సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న ముత్తారం మండల కేంద్రములోని కే.జి.బి.వి విద్యార్థినులను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి పరామర్శించారు.ముత్తారం మండలంలోని కే.జి.బీ.విలో బాలికలు అస్వస్థతకు గురైతే హాస్టల్ వార్డెన్ సమాచారం అందించడంతో వెంటనే జిల్లా ఆసుపత్రికి 53 మంది చిన్నారి బాలికలను తరలించి 10 మంది వైద్యులు, 20 మంది స్టాఫ్ నర్సులు ఆధ్వర్యంలో అత్యుత్తమ చికిత్స అందించామని అన్నారు. బాలికలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఐవి ఫ్ల్యుడ్స్, స్టెరాయిడైస్ మొదలగు చికిత్సను అందించామని అన్నారు. కొంత మంది బాలికలకు చలికాలంలో శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే మెడికల్ హిస్టరీ ఉందని, వారికి ఆసుపత్రిలో ఆక్సిజన్ సౌకర్యం చికిత్స అందుబాటులో పెట్టామని అన్నారు. ఆసుపత్రిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అధికారిని ఇంచార్జి పెట్టి బాలికలకు అందిస్తున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామని, బాలికల తల్లి దండ్రులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడం జరిగిందని అన్నారు. బాలికలు ఒకే సారి అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలను విచారిస్తున్నామని, అక్కడ సమీపంలో గల డంప్ యార్డ్ ను తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు.53 మంది బాలికలు క్షేమంగా ఉన్నారని ఎవరు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వైద్యులు, కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. కేజీబీవీ పాఠశాలలో కూడా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత పై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, భవిష్యత్తులో బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోమోస్ తిని మహిళ మృతి



## - పలువురికి తీవ్ర అస్వస్థత

- మహిళ మృతితో జీహెచ్ఎంసీ చర్యలు
- మోమోస్ తయారుచేసిన సంస్థను సీజ్ చేసిన అధికారులు
- మయోనైజ్‌ను పదార్థంపై నిషేధం.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఈ మధ్య కాలంలో స్ట్రీట్ ఫుడ్ తిని చనిపోతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అలాంటి ఘటనే జరిగింది. మోమోస్ తిని ఓ మహిళ మృతిచెందడం హైదరాబాద్ లో కలకలం రేపుతోంది. మోమోస్ తిన్న మరో 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

### - అసలేం జరిగిందంటే..

నగరంలోని నందినగర్, సింగాడకుంట బస్తీకి చెందిన గౌరీ శంకర్ కాలనీలో శుక్రవారం సంత జరిగింది. ఈ సంతలో విక్రయించిన మోమోస్ ను స్థానిక సింగాడకుంట బస్తీకి చెందిన పలువురు తిన్నారు. అదేరోజు రాత్రి నుంచి వారికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మోమోస్ తిని తీవ్ర అస్వస్థతకు గురైన వీరిని నగరంలోని పలు ఆసుపత్రులలో చేరి చికిత్స పొందుతున్నారు. రేష్మ బేగం (31) పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్య కోసం ఆమెను నిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయింది. మోమోస్ తిన్న వారిలో పది మంది వరకు మైనర్లు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. మోమోస్ తిని అస్వస్థతకు గురైన ఘటనపై బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. శుక్రవారం రోజు సంతలో మోమోస్ విక్రయించిన ఇద్దరు చిరువ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. మోమోస్ బాధితుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ కు క్యూ కడుతున్నారు. అయితే మోమోస్ తో ఇచ్చే మిర్చి చట్నీ, మయోనైజ్ కలుషితం, అపరిశుభ్రమైనది ఇవ్వడం వల్లే తిన్నవారు అస్వస్థతకు గురై ఉండొచ్చునని ప్రాథమికంగా భావిస్తున్నారు.

### - ఇటీవల షవర్మ తిని పలువురికి అస్వస్థత

హైదరాబాద్ నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నా ఆహార కల్తీ కేసులు మాత్రం తగ్గడం లేదు. ఇటీవల సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో షవర్మా తిన్న ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. కొందరు వాంతులు, కొందరు విరేచనాలు కావడంతో హాస్పత్రిలో చేరి చికిత్స పొందారు. మరోచోట సైతం ఇలాంటి ఘటనే జరిగింది. అల్వాల్ లోని ఓ హోటల్‌లో షవర్మా తిన్న కొందరు అస్వస్థతకు గురై హాస్పిటల్ లో చేరాల్సి వచ్చింది. వారు తిన్న ఆహారంలో ప్రమాదరకర బ్యాక్టీరియా ఉన్నట్లు పరీక్షలు చేసిన డాక్టర్లు తెలిపారు. షవర్మ తినేందుకు వినియోగించే మయోనైజ్ కలుషితం కావడం, నాసిరకంగా ఉండటంతో తిన్నవారు అస్వస్థతకు లోనయ్యారని గుర్తించారు.

### - మయోనైజ్‌ను నిషేధించాలని ప్రభుత్వానికి జీహెచ్ఎంసీ సలహా



ఇటీవల చిరుతిండ్లు తిన్నాక నగర ప్రజలు అస్వస్థతకు గురవుతుదన్నారని అందుకు మయోనైజ్ అనే పదార్థం కారమని దాన్ని నిషేధించాలని జీహెచ్ఎంసీ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. గుడ్డుతో తయారుచేసే ఈ పదార్థం కారణంగా అస్వస్థతకు గురై ఆసుపత్రుల్లో చేరుతున్నారని ప్రభుత్వానికి అధికారులు తెలిపారు. మోమోస్ తిని మహిళ మృతిచెందిన ఘటనలో జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. మోమోస్ తయారు చేసిన సంస్థను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు.

# బుచ్చమ్మది ఆత్మహత్య కాదు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య

## - ఆమె కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

- రేవంత్ రెడ్డిపై హత్య కేసు నమోదు చేయాలి
- నోటీసులు ఇవ్వకుండానే పేదల ఇళ్లు కూలగొడతారా? అని ఆగ్రహం
- ప్రభుత్వమే అనుమతులిచ్చి, ఇప్పుడు కూలగొట్టడంపై కేటీఆర్ ఆగ్రహం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రాపై హత్య కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హైడ్రా కూల్చివేతల భయంతో కూకట్‌పల్లిలో ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ అర్థం పర్థం లేకుండా ఆనాలోచితంగా గుడ్డెద్దు చేలో పడినట్లు ఇష్టమొచ్చినట్లు కూకట్‌పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేశారని మండిపడ్డారు. హైడ్రా అనే బ్లాక్‌మెయిల్ సంస్థను పేదల మీదకు ఉసిగొల్పి నోటీసులు ఇవ్వకుండానే మీ ఇళ్లు కూలగొడతామంటూ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం భయానక వాతావారణం సృష్టించిందని ఆరోపించారు. పిల్లలు పుస్తకాలను తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా పేదల ఇళ్లు కూలగొడుతున్నారని ధ్వజమెత్తారు. ఎక్కడ తన ఇల్లు కూలగొడతారేమోనని ఆందోళనతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. బుచ్చమ్మ కుటుంబాన్ని చూస్తే బాధేస్తోందన్నారు. బుచ్చమ్మ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వమే అనుమతులు ఇచ్చి పన్నులు కట్టించుకొని ఇప్పుడు అదే ప్రభుత్వం కూలగొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా కారణంగానే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందన్నారు. ఇది ఆత్మహత్య కాదని, హైడ్రా అనే సంస్థతో రేవంత్ రెడ్డి చేయించిన హత్య అన్నారు. రేవంత్ ప్రభుత్వం దిక్కుమాలిన చర్యలతో పేదలు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటాననంటే కూడా తీసుకోనీయకుండా ఇల్లు కూల్చారని విమర్శించారు. ఇంత అమానవీయంగా ప్రవర్తించడం దారుణమన్నారు. అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు కడతామని ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారని, కానీ ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కట్టింది లేదు పేదల ఇళ్లను మాత్రం కూల్చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా రేవంత్ రెడ్డి అరాచకం గురించి చర్చించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి, ఆయన కేబినెట్ మంత్రులు ఏం చేస్తున్నారో ప్రజలంతా చూస్తున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా పేరుతో బ్లాక్ మెయిల్ దందా చేస్తున్నారా? అని నిలదీశారు. నీ మంత్రులది, నీ తమ్ముళ్లదీ ఇదే దందానా? బిల్డర్లను బెదిరించి చందాలు తీసుకోవడానికే ఈ ప్రభుత్వం ఉందా? గరీబోళ్ళ ఇళ్లు కూలగొట్టి హైడ్రా పేరుతో దందా చేస్తున్నారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో ఈరోజు అరాచక ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. గరీబోళ్ల పొట్ట కొట్టే ప్రభుత్వ చర్యలపై తాము పోరాడుతామన్నారు. హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగ బట్టిందన్నారు. కచ్చితంగా ఈ ప్రభుత్వం మీద మనమంతా తిరగబడాలని పిలుపునిచ్చారు.

# ఢిల్లీ కాలుష్యానికి పాకిస్థానే కారణమా.?



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** చలికాలం ప్రారంభంలోనే ఉత్తర భారతదేశాన్ని గాలి కాలుష్యం ముంచేస్తోంది. ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాలతోపాటు ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు నగరాల్లో కూడా గాలి నాణ్యత రోజురోజుకూ తీవ్రంగా పడిపోతోంది. ఈ నేపథ్యంలోనే పరిస్థితి తీవ్రంగా మారింది. ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో రైతులు పంటలు పూర్తయిన తర్వాత వాటి వ్యర్థాలను కాల్చేస్తారు. దీంతో పంట వ్యర్థాలను కాల్చగా వచ్చిన రసాయనాలు, పొగతో గాలి పూర్తిగా కాలుష్యం అవుతూ ఉంటుంది. దీనిపై పర్యావరణ వేత్తలు, ప్రభుత్వాలు, కోర్టులు చివరికి సుప్రీంకోర్టు కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇక ఢిల్లీలో శీతాకాలం వచ్చిందంటే చాలు గాలిలో ఉన్న కాలుష్యాన్ని తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకుంటూ ఉంటారు. అయినప్పటికీ గాలి నాణ్యత తీవ్ర ప్రమాదరకరమైన స్థితిలోనే ఉంటోంది. అయితే ఉత్తర్‌ప్రదేశ్‌లోని 3 నగరాల్లో గాలి కాలుష్యానికి ప్రధాన కారణం పాకిస్తాన్ అంటూ ఉత్తర్‌ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి డీకే గుప్తా తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్తాన్‌లో రైతులు పంట వ్యర్థాలను దహనం చేయడం వల్లే.. గ్రేటర్ నోయిడా, నోయిడా, ఘజియాబాద్ నగరాల్లో గాలి పూర్తిగా విషపూరితంగా మారిందని పేర్కొన్నారు. నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్ నగరాల్లో గాలి నాణ్యత సూచి - ఏక్యూఐ దారుణంగా పడిపోయింది. నోయిడాలో 304 ఏక్యూఐ గ్రేటర్ నోయిడాలో 312 ఏక్యూఐ ఘజియాబాద్‌లో 324 మేర ఏక్యూఐ నమోదైంది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ నోయిడాలోని ఉత్తర్‌ప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి డీకే గుప్తా ఆ రాష్ట్రంలో నమోదవుతున్న గాలి కాలుష్యం గురించి మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్‌లో ఒకే రోజు గాలి నాణ్యత సూచి దారుణంగా పడిపోవడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ పరిస్థితికి మనం మన పొరుగు దేశం అయిన పాకిస్తాన్‌ను నిందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాకిస్తాన్‌లో పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల ఈ 3 నగరాల్లో గాలి విషపూరితంగా మారిందని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్తాన్‌లో పంట వ్యర్థాలను దహనం చేస్తే.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నగరాల్లో గాలి కాలుష్యానికి కారణం అని కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఆరోపించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

# రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతలో మార్పు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతలో మార్పులు చేశారు. తెలంగాణలో కొన్ని రోజులుగా బెటాలియన్ పోలీసులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇంటి వద్ద బెటాలియన్ పోలీసులను తప్పించారు. ముఖ్యమంత్రి నివాసం వద్ద బందోబస్తులో బెటాలియన్ పోలీస్ సిబ్బంది కూడా ఉంది. అయితే, సీఎం సెక్యూరిటీ వింగ్ తాజాగా వారిని తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్ డ్ రిజర్వ్ సిబ్బందితో భద్రతను కల్పించింది. ముఖ్యమంత్రి ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్‌పీ సిబ్బందిని సీఎం సెక్యూరిటీ వింగ్ మార్చింది. వారి స్థానంలో ఆర్మ్ డ్ రిజర్వ్ సిబ్బందికి సీఎం భద్రతా విధులు అప్పగించింది.

# హైదరాబాద్‌లో 144 సెక్షన్

- హైదరాబాద్ సీపీ కీలక నిర్ణయం
- నెల రోజుల పాటు అమలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ పరిధిలో నెల రోజుల పాటు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని చెప్పారు. నగరంలో ఎటువంటి సమావేశాలు, ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు, ఆందోళనకు అనుమతి లేదని చెప్పారు. పోలీసుల ఆదేశాలు పాటించకుండా, అనుమతి లేకుండా సమావేశాలు, ధర్నాలు, నిరసనలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రజలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ స్పెషల్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళనలు చేపడుతున్నారు. ఓకే రాష్ట్రం-ఒకే పోలీసింగ్ విధానం అమలు చేయాలంటూ నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు సెక్రటేరియట్ ముందు ఆందోళలు చేపట్టారు. ఇక క్రమశిక్షణ చర్యల్లో భాగంగా 39 మంది కానిస్టేబుళ్లను పోలీస్ శాఖ సస్పెండ్ చేసింది. మరో 10 మందిని డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ స్పెషల్ పోలీసులు ఆందోళనలు ఉధృతం చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దానికి తోడు జన్వాడ పార్టీ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత బంధువులకు చెందిన ఫాంహౌస్‌లో భారీగా విదేశీ మద్యం పట్టుబటం కలకలం రేపుతోంది. ఇప్పటికే పలువురు వ్యక్తులపై కేసులు నమోదు కాగా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. అది రేవ్ పార్టీ కాదని కుటుంబ సభ్యులతో చేసుకుంటున్న దావత్ అని చెబుతున్నారు. ప్రభుత్వం కావాలనే తప్పుడు కేసులు పెడుతుందని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నేడు నిరసనలకు పిలుపునిచ్చే ప్రమాదం ఉండటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఈ వ్యవహారాలను దృష్టిలో ఉంచుకొని నగరంలో నెల రోజుల పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు.

# పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం

## - ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** రాష్ట్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దసరాకే కాదు.. దీపావళికి కూడా రైతులను దివాళా తీయిస్తారా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం మూలుగుతున్నా.. వాటిని కొనాలని అధికారులకు ఆదేశాలు అందలేదని విమర్శించారు. ప్రభుత్వానికి రైతుల గోస పట్టడం లేదని మండిపడ్డారు. రాజకీయాలపై పెట్టిన దృష్టి ధాన్యం కొనుగోళ్లపై ఎందుకు పెట్టరని, రైతులంటే ఎందుకంత అలుసని నిలదీశారు. మీ గారడీ హామీలను రైతులు విశ్వసించి మోసపోతున్నందుకా? అర్థించడం తప్ప అక్రోషించడం తెలియని అమాయకులైనందుకా? అని ప్రశ్నించారు. రాజకీయాల్లో రాక్షసక్రీడలను మానేసి.. రైతులను ఆదుకోవడంపై దృష్టి కేంద్రీకరించాలని హితవుపలికారు. దయచేసి రైతుల విషయంలో రాజకీయాలు చేయవద్దని ఎక్స్ వేదికగా కోరారు. 'దసరాకే కాదు.. దీపావళికి కూడా రైతులను దివాళా తీయిస్తారా?కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యం మూలుగుతున్నా.. ధాన్యం కొనాలని అధికారులకు ఆదేశాలు అందవాయే.. ప్రభుత్వానికి రైతుల గోస పట్టదాయే!! ÷రాజకీయాలపై పెట్టిన దృష్టి? ధాన్యం కొనుగోలుపై ఎందుకు పెట్టరు? రైతులంటే ఎందుకంత అలుసు? మీ గారడీ హామీలను రైతులు విశ్వసించి మోసపోతున్నందుకా? అర్థించడం తప్ప అక్రోషించడం తెలియని అమాయకులైనందుకా? ÷రాజకీయాల్లో రాక్షసక్రీడలను మానేసి.. రైతులను ఆదుకోవడంపై దృష్టి కేంద్రీకరించండి..దయచేసి రైతుల విషయంలో రాజకీయాలు చేయకండి..' అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588